# 67. సూరహ్ అల్-ముల్క్

سُورَةُ المُلْكِ

*అల్-ముల్క్*: The Dominion, **సామ్రాజ్యాధిపత్యం,** అధికారం, ఆధిపత్యం, రాజ్యం, ప్రభుత్వం. ఇంతవరకు 14/15వ వంతు ఖుర్ఆన్ పూర్తి అయ్యింది. ఇక మిగిలిన 1/15 భాగంలో చిన్న చిన్న *సూరాహ్‌లు* చాలా మట్టుకు **మక్కహ్** కు చెందినవి ఉన్నాయి. ఈ *సూరహ్* గొప్పతనాలను గురించిన 'హదీస్'లు ఎన్నో ఉన్నాయి. వాటిలో ఒకటి: "ఒక *సూరహ్* 30 *ఆయాతులది* ఉంది. అది **మానవునికి సిఫారసు చేస్తుంది**, దాని వల్ల అతడు క్షమించబడతాడు." అన్న 'హదీస్' (సునన్ తిర్మిజీ', సునన్ అబూ-దావూద్, ఇబ్నె-మాజహ్ మరియు ముస్నద్ అ'హ్మద్). మరొక 'హదీస్': "ఖుర్ఆన్‌లో ఒక *సూరహ్* ఉంది అది తనను చదివిన వాడిని స్వర్గానికి పంపే వరకు అల్లాహ్ (సు.త.) తో వాదులాడు తుంది." (*మజ్మ'అ అ'జ్జవా యి'ద్* 7/172,) మరొక 'హదీస్': "దైవప్రవక్త ('స'అ.స.) రాత్రి నిద్రపోక ముందు *సూరహ్ అస్-సజ్దా* **(32)**, *సూరహ్ అల్-ముల్క్* **(67)** తప్పక చదివేవారు." మరొక షే'ఖ్ అల్బానీ సమకూర్చిన 'స'హీ'హ్ *రివాయత్‌లో*: "*సూరహ్ అల్-ముల్క్* **గోరీ శిక్ష నుండి కాపాడుతుంది.** అయితే చదివే వాడు ఇస్లాం ఆజ్ఞలను మరియు విధులను పాటించేవాడై ఉండాలి!" అని ఉంది. **30** *ఆయాతులున్న* ఈ *సూరహ్* పేరు **మొదటి** *ఆయత్* నుండి తీసుకోబడింది.

**అనంత కరుణామయుడు అపార కరుణాప్రదాత అయిన అల్లాహ్ పేరుతో**

بِسۡمِ اللّٰهِ الرَّحۡمٰنِ الرَّحِيۡمِ ○

**1.** [(*)] ఎవరి చేతిలోనయితే విశ్వ **సామ్రాజ్యాధిపత్యం** ఉందో! ఆయన శుభదాయకుడు మరియు ఆయన ప్రతీదీ చేయగల సమర్థుడు (అధికారం గలవాడు).

تَبٰرَكَ الَّذِىۡ بِيَدِهِ الۡمُلۡكُ وَهُوَ عَلٰى كُلِّ شَىۡءٍ قَدِيۡرُ ۙ‏ ①

**2.** ఆయనే! మీలో మంచి పనులు చేసే వారెవరో పరీక్షించటానికి, చావుబ్రతుకులను సృష్టించాడు. [1] మరియు ఆయన సర్వ శక్తిమంతుడు క్షమాశీలుడు.

الَّذِىۡ خَلَقَ الۡمَوۡتَ وَالۡحَيٰوةَ لِيَبۡلُوَكُمۡ اَيُّكُمۡ اَحۡسَنُ عَمَلًا ؕ وَهُوَ الۡعَزِيۡزُ الۡغَفُوۡرُ ۙ‏ ②

---

1) **రూ'హ్:** ఒక విచిత్రమైన శక్తి. దాని వాస్తవం అల్లాహ్ (సు.త.)కు తప్ప మరెవ్వరికీ తెలియదు. దాని సంబంధం ఒక శరీరంతో ఏర్పడినప్పుడు అది సజీవిగా పరిగణించబడుతుంది. దాని సంబంధం తెగిపోయిన శరీరం, మృత దేహంగా (నిర్జీవిగా) పరిగణించబడుతుంది. అల్లాహ్ (సు.త.) ఈ తాత్కాలిక జీవితాన్నిచ్చి, తరువాత మరణింపజేస్తాడు. ఈ తాత్కాలిక జీవితాన్ని సరైనవిధంగా ఎవడు వినియోగిస్తాడనేది ఆయన (సు.త.) పరీక్షిస్తున్నాడు. ఎవడైతే ఈ తాత్కాలిక జీవితాన్ని విశ్వాసం మరియు అల్లాహ్ (సు.త.) విధేయత కోసం వినియోగిస్తాడో వాడు మంచి ప్రతిఫలం పొందుతాడు. అలా చేయనివాడి కొరకు నరక శిక్ష ఉంటుంది.

**3.** ఆయనే, ఒకదానిపై ఒకటి ఏడు ఆకాశాలను సృష్టించాడు. ఆ అనంత కరుణామయుని సృష్టిలో నీవు ఎలాంటి లోపాన్నీ చూడలేవు. కావాలంటే మరొకసారి చూడు: "ఏమీ? నీకేమైనా లోపం కనిపిస్తుందా?"

الَّذِىْ خَلَقَ سَبْعَ سَمٰوٰتٍ طِبَاقًا ؕ مَا تَرٰى فِىْ خَلْقِ الرَّحْمٰنِ مِنْ تَفٰوُتٍ ؕ فَارْجِعِ الْبَصَرَ ۙ هَلْ تَرٰى مِنْ فُطُوْرٍ ③

**4.** ఇంకా, మాటిమాటికీ నీ చూపులు త్రిప్పి చూడు. అవి (నీ చూపులు) విఫలమై, అలిసి సొలసి తిరిగి నీవైపుకే వస్తాయి.

ثُمَّ ارْجِعِ الْبَصَرَ كَرَّتَيْنِ يَنْقَلِبْ اِلَيْكَ الْبَصَرُ خَاسِئًا وَّهُوَ حَسِيْرٌ ④

**5.** మరియు వాస్తవంగా, మేము భూమికి దగ్గరగా ఉన్న ఆకాశాన్ని దీపాలతో అలంకరించాము. మరియు వాటిని, షైతాన్‌లను తరిమి కొట్టే సాధనాలుగా చేశాము.[2] మరియు వారి కొరకు (షైతాన్‌ల కొరకు) మేము భగభగ మండే అగ్నిజ్వాలల శిక్షను సిద్ధపరచి ఉంచాము.

وَلَقَدْ زَيَّنَّا السَّمَآءَ الدُّنْيَا بِمَصَابِيْحَ وَجَعَلْنٰهَا رُجُوْمًا لِّلشَّيٰطِيْنِ وَاَعْتَدْنَا لَهُمْ عَذَابَ السَّعِيْرِ ⑤

**6.** మరియు తమ ప్రభువును (అల్లాహ్‌ను) తిరస్కరించే వారికి నరక శిక్ష ఉంది. అది ఎంత చెడ్డ గమ్యస్థానం.

وَلِلَّذِيْنَ كَفَرُوْا بِرَبِّهِمْ عَذَابُ جَهَنَّمَ ؕ وَبِئْسَ الْمَصِيْرُ ⑥

**7.** వారు అందులోకి విసిరివేయబడినప్పుడు, వారు దాని (భయంకరమైన) గర్జనను వింటారు. మరియు అది మరిగి పొంగుతూ ఉంటుంది.

اِذَآ اُلْقُوْا فِيْهَا سَمِعُوْا لَهَا شَهِيْقًا وَّهِىَ تَفُوْرُ ۙ ⑦

**8.** అది దాదాపు ఉద్రేకంతో ప్రేలిపోతూ ఉంటుంది. ప్రతిసారి అందులోకి (పాపుల) గుంపు పడవేయబడినప్పుడు! దాని కాపలా దారులు వారితో: "ఏమీ? మీ వద్దకు ఏ హెచ్చరిక చేసేవాడు రాలేదా?" అని, ప్రశ్నిస్తారు.

تَكَادُ تَمَيَّزُ مِنَ الْغَيْظِ ؕ كُلَّمَآ اُلْقِىَ فِيْهَا فَوْجٌ سَاَلَهُمْ خَزَنَتُهَآ اَلَمْ يَاْتِكُمْ نَذِيْرٌ ⑧

**9.** వారంటారు: "ఎందుకు రాలేదు! వాస్తవానికి మా వద్దకు హెచ్చరిక చేసేవాడు వచ్చాడు, కాని మేము అతనిని అసత్యుడవని తిరస్కరించాము మరియు అతనితో ఇలా అన్నాము: 'అల్లాహ్ దేనినీ (ఏ దివ్య

قَالُوْا بَلٰى قَدْ جَآءَنَا نَذِيْرٌ ۙ۬ فَكَذَّبْنَا وَقُلْنَا مَا نَزَّلَ اللّٰهُ مِنْ شَىْءٍ ۚۖ اِنْ اَنْتُمْ اِلَّا فِىْ ضَلٰلٍ كَبِيْرٍ ⑨

---

2) చూడండి, 37:6-10.

జ్ఞానాన్ని) అవతరింపజేయలేదు; మీరు కేవలం ఘోర మార్గభ్రష్టత్వంలో పడి ఉన్నారు!' "

10. ఇంకా వారు ఇలా అంటారు: "ఒకవేళ మేము విని ఉంటే లేదా గ్రహించి ఉంటే, మేము మండే అగ్నిజ్వాలలలో పడివుండే వారితో చేరే వారము కాము కదా!"

وَقَالُوْا لَوْ كُنَّا نَسْمَعُ اَوْ نَعْقِلُ مَا
كُنَّا فِيْٓ اَصْحٰبِ السَّعِيْرِ ١٠

11. అప్పుడు, వారే స్వయంగా తమ పాపాన్ని ఒప్పుకుంటారు. కనుక ఈ నరక వాసులు (దైవకారుణ్యానికి) దూరమవుదురు గాక!

فَاعْتَرَفُوْا بِذَنْۢبِهِمْ ۚ فَسُحْقًا
لِّاَصْحٰبِ السَّعِيْرِ ١١

12. నిశ్చయంగా, ఎవరైతే అగోచరుడైన తమ ప్రభువుకు భయపడతారో! వారికి క్షమాపణ మరియు గొప్ప ప్రతిఫలం ఉంటాయి.

اِنَّ الَّذِيْنَ يَخْشَوْنَ رَبَّهُمْ بِالْغَيْبِ
لَهُمْ مَّغْفِرَةٌ وَّاَجْرٌ كَبِيْرٌ ١٢

13. మరియు మీరు మీ మాటలను రహస్యంగా ఉంచినా సరే! లేక వాటిని వెల్లడి చేసినా సరే! నిశ్చయంగా, ఆయనకు హృదయాల స్థితి బాగా తెలుసు.

وَاَسِرُّوْا قَوْلَكُمْ اَوِ اجْهَرُوْا بِهٖ ۗ
اِنَّهٗ عَلِيْمٌۢ بِذَاتِ الصُّدُوْرِ ١٣

14. ఏమిటీ? పుట్టించిన వాడికే తెలియదా? మరియు ఆయన సూక్ష్మగ్రాహి, సర్వం తెలిసినవాడు!

اَلَا يَعْلَمُ مَنْ خَلَقَ ۗ وَهُوَ
اللَّطِيْفُ الْخَبِيْرُ ١٤

15. భూమిని మీ ఆధీనంలో ఉంచినవాడు ఆయనే! కావున మీరు దాని దారులలో తిరగండి. మరియు ఆయన ప్రసాదించిన జీవనోపాధిని తినండి. మరియు మీరు ఆయన వైపునకే సజీవులై మరలిపోవలసి ఉంది.

هُوَ الَّذِيْ جَعَلَ لَكُمُ الْاَرْضَ
ذَلُوْلًا فَامْشُوْا فِيْ مَنَاكِبِهَا وَكُلُوْا
مِنْ رِّزْقِهٖ ۗ وَاِلَيْهِ النُّشُوْرُ ١٥

16. ఏమీ? మీరు నిర్భయంగా ఉన్నారా? ఆకాశాలలో ఉన్నవాడు, మిమ్మల్ని భూమిలోకి అణగద్రొక్కడని - ఎప్పుడైతే అది తీవ్ర కంపనాలకు గురి అవుతుందో?

ءَاَمِنْتُمْ مَّنْ فِي السَّمَآءِ اَنْ
يَّخْسِفَ بِكُمُ الْاَرْضَ فَاِذَا هِيَ
تَمُوْرُ ١٦

17. లేక, ఆకాశాలలో ఉన్నవాడు, మీపైకి రాళ్ళు కురిపించే గాలివాన పంపడని, మీరు నిర్భయంగా ఉన్నారా? నా హెచ్చరిక ఎలాంటిదో అప్పుడు మీరు తెలుసుకోగలరు.

اَمْ اَمِنْتُمْ مَّنْ فِي السَّمَآءِ اَنْ يُّرْسِلَ
عَلَيْكُمْ حَاصِبًا ۗ فَسَتَعْلَمُوْنَ
كَيْفَ نَذِيْرِ ١٧

**18.** మరియు వాస్తవానికి వారికి పూర్వం గతించిన వారు కూడా (ప్రవక్తలను) అసత్య వాదులని తిరస్కరించారు. నా పట్టు (శిక్ష) ఎంత తీవ్రంగా ఉండిందో (చూశారా)?

وَلَقَدْ كَذَّبَ الَّذِيْنَ مِنْ قَبْلِهِمْ فَكَيْفَ كَانَ نَكِيْرِ ⑱

**19.** ఏమీ? వారు తమ మీద ఎగిరే పక్షులు రెక్కలను ఎలా చాపుతూ ముడుచుకుంటూ, ఎగురుతున్నాయో చూడటం లేదా? ఆ అనంత కరుణామయుడు తప్ప మరెవ్వరూ వాటిని అలా నిలిపి ఉంచలేరు కదా! నిశ్చయంగా, ఆయన ప్రతి దానినీ చూస్తున్నాడు!

اَوَلَمْ يَرَوْا اِلَى الطَّيْرِ فَوْقَهُمْ صٰٓفّٰتٍ وَّيَقْبِضْنَ ؔۘ مَا يُمْسِكُهُنَّ اِلَّا الرَّحْمٰنُ ؕ اِنَّهٗ بِكُلِّ شَيْءٍۭ بَصِيْرٌ ⑲

**20.** ఏమీ? అనంత కరుణామయుడు తప్ప మీకు సేనవలే అడ్డుగా నిలిచి, మీకు సహాయ పడగల వాడెవడైనా ఉన్నాడా? ఈ సత్య-తిరస్కారులు కేవలం మోసంలో పడి ఉన్నారు.

اَمَّنْ هٰذَا الَّذِيْ هُوَ جُنْدٌ لَّكُمْ يَنْصُرُكُمْ مِّنْ دُوْنِ الرَّحْمٰنِ ؕ اِنِ الْكٰفِرُوْنَ اِلَّا فِيْ غُرُوْرٍ ⑳

**21.** ఒకవేళ ఆయన మీ జీవనోపాధిని ఆపి వేస్తే, మీకు జీవనోపాధి ఇచ్చేవాడు ఎవడు న్నాడు? అయినా వారు తలబిరుసుతనంలో మునిగి (సత్యానికి) దూరమై పోతున్నారు.

اَمَّنْ هٰذَا الَّذِيْ يَرْزُقُكُمْ اِنْ اَمْسَكَ رِزْقَهٗ ۚ بَلْ لَّجُّوْا فِيْ عُتُوٍّ وَّنُفُوْرٍ ㉑

**22.** ఏమీ? ఎవడైతే తన ముఖం మీద దేవులాడుతూ నడుస్తాడో, అతడు సరైన మార్గం పొందుతాడా? [3] లేక చక్కగా రుజు మార్గం మీద నడిచేవాడు (పొందుతాడా)?

اَفَمَنْ يَّمْشِيْ مُكِبًّا عَلٰى وَجْهِهٖٓ اَهْدٰٓى اَمَّنْ يَّمْشِيْ سَوِيًّا عَلٰى صِرَاطٍ مُّسْتَقِيْمٍ ㉒

**23.** వారితో ఇలా అను: "ఆయనే మిమ్మల్ని సృటించాడు. మరియు ఆయనే మీకు వినేశక్తిని, చూసేశక్తిని మరియు హృదయాలను ప్రసాదించాడు. మీరు తక్కువగా కృతజ్ఞతలు తెలుపుతున్నారు!"

قُلْ هُوَ الَّذِيْٓ اَنْشَاَكُمْ وَجَعَلَ لَكُمُ السَّمْعَ وَالْاَبْصَارَ وَالْاَفْـِٕدَةَ ؕ قَلِيْلًا مَّا تَشْكُرُوْنَ ㉓

**24.** (ఇంకా) ఇలా అను: "ఆయనే మిమ్మల్ని భూమిపై వ్యాపింపజేశాడు మరియు ఆయన వైపునకే మీరంతా సమీకరించబడతారు."

قُلْ هُوَ الَّذِيْ ذَرَاَكُمْ فِي الْاَرْضِ وَاِلَيْهِ تُحْشَرُوْنَ ㉔

---

3) చూడండి, 17:97.

**25.** మరియు వారిలా అడుగుతున్నారు: "మీరు సత్యవంతులే అయితే, ఈ వాగ్దానం ఎప్పుడు పూర్తి కానున్నది?"

وَيَقُوْلُوْنَ مَتٰى هٰذَا الْوَعْدُ اِنْ كُنْتُمْ صٰدِقِيْنَ ﴿25﴾

**26.** వారితో ఇలా అను: "నిశ్చయంగా, దాని జ్ఞానం కేవలం అల్లాహ్‌కే ఉంది. [4] మరియు నేను స్పష్టంగా హెచ్చరిక చేసేవాడిని మాత్రమే!"

قُلْ اِنَّمَا الْعِلْمُ عِنْدَ اللّٰهِ ۖ وَاِنَّمَاۤ اَنَا نَذِيْرٌ مُّبِيْنٌ ﴿26﴾

**27.** తరువాత వారు దానిని సమీపంలో ఉండటం చూసినప్పుడు, సత్య-తిరస్కారుల ముఖాలు వికృతంగా అయిపోతాయి.[5] మరియు వారితో ఇలా అనబడుతుంది: "మీరు దేనినయితే అడుగుతూ ఉండేవారో అది (ఆ వాగ్దానం) ఇదే!" [6]

فَلَمَّا رَاَوْهُ زُلْفَةً سِيْٓـَٔتْ وُجُوْهُ الَّذِيْنَ كَفَرُوْا وَقِيْلَ هٰذَا الَّذِيْ كُنْتُمْ بِهٖ تَدَّعُوْنَ ﴿27﴾

**28.** (ఓ ప్రవక్తా!) వారితో ఇలా అను: "ఏమీ? మీరు ఆలోచించారా? ఒకవేళ అల్లాహ్ నన్ను మరియు నా తోటి వారిని నాశనం చేయనూ వచ్చు! లేదా మమ్మల్ని కరుణించనూ వచ్చు. కాని సత్య-తిరస్కారులను బాధాకరమైన శిక్ష నుండి ఎవడు రక్షించ గలడు?"

قُلْ اَرَءَيْتُمْ اِنْ اَهْلَكَنِيَ اللّٰهُ وَمَنْ مَّعِيَ اَوْ رَحِمَنَا ۙ فَمَنْ يُّجِيْرُ الْكٰفِرِيْنَ مِنْ عَذَابٍ اَلِيْمٍ ﴿28﴾

**29.** వారితో ఇంకా ఇలా అను: "ఆయనే అనంత కరుణామయుడు, మేము ఆయననే విశ్వసించాము మరియు ఆయననే నమ్ముకున్నాము. ఇక ఎవరు స్పష్టమైన మార్గభ్రష్టత్వంలో పడి ఉన్నారో త్వరలోనే మీరు తెలుసుకోగలరు!"

قُلْ هُوَ الرَّحْمٰنُ اٰمَنَّا بِهٖ وَعَلَيْهِ تَوَكَّلْنَا ۚ فَسَتَعْلَمُوْنَ مَنْ هُوَ فِيْ ضَلٰلٍ مُّبِيْنٍ ﴿29﴾

**30.** వారితో ఇలా అను: "ఏమీ? మీరు ఆలోచించారా? ఒక వేళ మీ నీరు, భూమిలోనికి ఇంకిపోతే, ప్రవహించే ఈ నీటి ఊటలను మీ కొరకు ఎవడు బయటికి తేగలడు?" **(1/8)**

قُلْ اَرَءَيْتُمْ اِنْ اَصْبَحَ مَآؤُكُمْ غَوْرًا فَمَنْ يَّاْتِيْكُمْ بِمَآءٍ مَّعِيْنٍ ﴿30﴾

*****

---

4) ఇంకా చూడండి, 7:187.
5) చూడండి, 3:106.
6) చూడండి, 38:16 మరియు 8:32. ***

## 68. సూరహ్ అల్-ఖలమ్

سُورَةُ الْقَلَمِ

*ఖలమున్:* The Pen, **కలము**. ఇది మొదటి **మక్కహ్** కాలపు సూరహ్. అవతరణాక్రమంలో ఇది **3**వది. *సూరహ్ అల్-'అలఖ్* **(96)** యొక్క మొదటి **5** *ఆయాతుల* తరువాత *సూరహ్ అల్-ముద్దస్సి'ర్* (74) అవతరింపజేయబడింది. దాని తరువాత ఈ *సూరహ్ అల్-ఖలమ్* (68) అవతరింపజేయబడిందని, చాలా మంది వ్యాఖ్యాతల అభిప్రాయం. దీని మరొక పేరు సూరహ్ **నూన్**. **52** *ఆయాతులున్న* ఈ *సూరహ్* పేరు **మొదటి** *ఆయత్* నుండి తీసుకోబడింది.

**అనంత కరుణామయుడు అపార కరుణాప్రదాత అయిన అల్లాహ్ పేరుతో**

بِسۡمِ اللّٰهِ الرَّحۡمٰنِ الرَّحِيۡمِ ○

**1.** * <u>నూన్</u>. [1] కలము సాక్షిగా! [2] మరియు వారు (దైవదూతలు) వ్రాస్తున్నదాని సాక్షిగా!

نٓ وَالۡقَلَمِ وَمَا يَسۡطُرُوۡنَۙ ①

**2.** నీ ప్రభువు అనుగ్రహం వలన నీవు (ఓ ము'హమ్మద్) పిచ్చివాడవు కావు!

مَاۤ اَنۡتَ بِنِعۡمَةِ رَبِّكَ بِمَجۡنُوۡنٍ ②

**3.** మరియు నిశ్చయంగా, నీకు ఎన్నటికీ తరిగిపోని ప్రతిఫలం ఉంది.

وَاِنَّ لَكَ لَاَجۡرًا غَيۡرَ مَمۡنُوۡنٍ ③

**4.** మరియు నిశ్చయంగా, నీవు నైతికంగా అత్యుత్తమ స్థానంలో ఉన్నావు! [3]

وَاِنَّكَ لَعَلٰى خُلُقٍ عَظِيۡمٍ ④

**5.** కావున త్వరలోనే నీవు చూడగలవు మరియు వారు కూడా చూడగలరు;

فَسَتُبۡصِرُ وَيُبۡصِرُوۡنَۙ ⑤

**6.** మీలో ఎవరికి పిచ్చి ఉందో!

بِاَيِّٮكُمُ الۡمَفۡتُوۡنُ ⑥

**7.** నిశ్చయంగా, నీ ప్రభువు! ఆయనకు ఎవడు ఆయన మార్గం నుండి వైదొలగి ఉన్నాడో తెలుసు. మరియు ఎవడు సన్మార్గంలో ఉన్నాడనేది కూడా ఆయనకు బాగా తెలుసు!

اِنَّ رَبَّكَ هُوَ اَعۡلَمُ بِمَنۡ ضَلَّ عَنۡ سَبِيۡلِهٖ وَهُوَ اَعۡلَمُ بِالۡمُهۡتَدِيۡنَ ⑦

---

1) ఖుర్ఆన్ అవతరణలో, అవతరించిన **మొదటి బీజ అక్షరం** ఇది. ఈ అక్షరం <u>**నూన్**</u>**,** *ముఖత్త'ఆత్‌లలోనిది.*

2) *అల్-ఖలము:* చూడండి, 96:3-5. కొందరు: ఇక్కడ ప్రమాణించేసే కలం, అంటే ఆ మొట్ట మొదట సృష్టించబడి, 'విధివ్రాత' వ్రాయమని ఆజ్ఞాపించబడిన కలము, అని చెబుతారు, సునన్ తిర్మిజీ', అల్బానీ ప్రమాణీకం (*త'స్ హీ'హ్*).

3) అంటే అల్లాహ్ (సు.త.) నీకు ఆదేశించిన మార్గం (ఇస్లాం)లో నీవు ఉన్నావు. దీని మరొక భావం నీవు మొదటి నుండియే ఉత్తమమైన గుణగణాలు గలవాడవు, సత్యసంధుడవు. 'ఆయి'షహ్ (ర.'అన్హా)తో దైవప్రవక్త ('స'అ.స.) యొక్క గుణగణాలు మరియు ప్రవర్తనను గురించి ప్రశ్నించగా ఆమె (ర.'అన్హా) అన్నారు: " '**ఖులుఖుహూ ఖుర్ఆన్**" అంటే అతని గుణ గణాలు ఖుర్ఆన్‌కు ప్రతి రూపాలు, ('స ముస్లిం).

فَلَا تُطِعِ الْمُكَذِّبِيْنَ ⑧

**8.** కావున నీవు ఈ అసత్యవాదులను అనుసరించకు.

وَدُّوْا لَوْ تُدْهِنُ فَيُدْهِنُوْنَ ⑨

**9.** ఒకవేళ నీవు (ధర్మం విషయంలో) మెత్తపడితే వారు కూడా మెత్తపడవలెనని కోరుతున్నారు.[4]

وَلَا تُطِعْ كُلَّ حَلَّافٍ مَّهِيْنٍ ⑩

**10.** కావున నీవు ప్రమాణాలు చేసే ప్రతి నీచుడిని అనుసరించకు;

هَمَّازٍ مَّشَّآءٍۢ بِنَمِيْمٍ ⑪

**11.** చాడీలు చెప్పే వాడిని, ఎత్తి పొడుస్తూ ఉండే వాడిని;

مَّنَّاعٍ لِّلْخَيْرِ مُعْتَدٍ اَثِيْمٍ ⑫

**12.** మంచిని నిరోధించే వాడిని, హద్దులు మీరి ప్రవర్తించే పాపిష్ఠుడిని;

عُتُلٍّۢ بَعْدَ ذٰلِكَ زَنِيْمٍ ⑬

**13.** నిర్దయుడిని, ఇంతే గాకుండా అపఖ్యాతి గల (నిందార్హుడైన) వాడిని;

اَنْ كَانَ ذَا مَالٍ وَّبَنِيْنَ ⑭

**14.** వాడు ధనవంతుడూ మరియు సంతాన భాగ్యంతో తులతూగుతూ ఉన్నవాడు అయినా సరే!

اِذَا تُتْلٰى عَلَيْهِ اٰيٰتُنَا قَالَ اَسَاطِيْرُ الْاَوَّلِيْنَ ⑮

**15.** ఒకవేళ వాడికి మా సూచన (ఆయాత్) లను వినిపిస్తే, అందుకు వాడు: "ఇవి పూర్వకాలపు కట్టు కథలే!" అని అంటాడు.

سَنَسِمُهٗ عَلَى الْخُرْطُوْمِ ⑯

**16.** మేము త్వరలోనే వాడి ముక్కు మీద వాత పెడ్తాము.

اِنَّا بَلَوْنٰهُمْ كَمَا بَلَوْنَآ اَصْحٰبَ الْجَنَّةِ اِذْ اَقْسَمُوْا لَيَصْرِمُنَّهَا مُصْبِحِيْنَ ⑰

**17.** నిశ్చయంగా, మేము ఆ తోట వారిని పరీక్షించినట్లుగా వీరిని కూడా పరీక్షిస్తాము. ఎవరైతే తెల్లవారగానే తప్పక దాని పంట కోసుకుందామని ప్రతిజ్ఞ చేసుకున్నారో!

وَلَا يَسْتَثْنُوْنَ ⑱

**18.** మరియు (అల్లాహ్ కోరితే) అనే, మినహాయింపుకు తావు ఇవ్వకుండా!

فَطَافَ عَلَيْهَا طَآئِفٌ مِّنْ رَّبِّكَ وَهُمْ نَآئِمُوْنَ ⑲

**19.** కావున వారు పడుకొని ఉండగానే నీ ప్రభువు తరఫు నుండి దానిపై (ఆ తోటపై) ఒక ఆపద వచ్చిపడింది.

فَاَصْبَحَتْ كَالصَّرِيْمِ ⑳

**20.** దాంతో తెల్లవారే సరికి అది (ఆ తోట) పంటకోసిన పొలం వలే మారిపోయింది.

---

4) అంటే నీవు ('స'అ.స.) ధర్మ విషయంలో కొన్ని సవరణలు చేయటానికి ఒప్పుకుంటే, వారు నీతో రాజీపడటానికి సిద్ధంగా ఉన్నారు.

فَتَنَادَوْا مُصْبِحِيْنَ ﴿21﴾

**21.** తరువాత ఉదయం లేచి వారు ఒకరితో నొకరు ఇలా చెప్పుకోసాగారు:

اَنِ اغْدُوْا عَلٰى حَرْثِكُمْ اِنْ كُنْتُمْ صٰرِمِيْنَ ﴿22﴾

**22.** "మీరు పంటను కోయాలనుకుంటే, ఉదయమే మీ పొలానికి వెళ్ళండి."

فَانْطَلَقُوْا وَهُمْ يَتَخَافَتُوْنَ ﴿23﴾

**23.** ఆ తరువాత వారు ఒకరితోనొకరు (ఈ విధంగా) మెల్లగా చెప్పుకుంటూ బయలు దేరారు:

اَنْ لَّا يَدْخُلَنَّهَا الْيَوْمَ عَلَيْكُمْ مِّسْكِيْنٌ ﴿24﴾

**24.** "ఈ రోజు ఏ పేదవాడిని కూడా మీ దగ్గరకు రానివ్వకండి!"

وَّغَدَوْا عَلٰى حَرْدٍ قٰدِرِيْنَ ﴿25﴾

**25.** మరియు వారు (పేదవారిని) దగ్గరకు రానివ్వకుండా కోయటంపై గట్టి నిర్ణయంతో, తెల్లవారుజామున బయలుదేరారు.

فَلَمَّا رَاَوْهَا قَالُوْٓا اِنَّا لَضَآلُّوْنَ ﴿26﴾

**26.** వారు దానిని (తోటను) చూసి ఇలా వా పోయారు: 'నిశ్చయంగా, మనం దారి తప్పాము!

بَلْ نَحْنُ مَحْرُوْمُوْنَ ﴿27﴾

**27.** "కాదు కాదు! మనం దరిద్రుల మయ్యాము!"

قَالَ اَوْسَطُهُمْ اَلَمْ اَقُلْ لَّكُمْ لَوْلَا تُسَبِّحُوْنَ ﴿28﴾

**28.** వారిలో (కొంచెం) మంచి వాడుగా ఉన్నవాడు ఇలా అన్నాడు: "ఏమీ? నేను మీతో అనలేదా? మీరు ఎందుకు ఆయన (అల్లాహ్) పవిత్రతను కొనియాడరని ('ఇన్షా-అల్లాహ్!' అనరని)?" [5]

قَالُوْا سُبْحٰنَ رَبِّنَآ اِنَّا كُنَّا ظٰلِمِيْنَ ﴿29﴾

**29.** వారన్నారు: "మా ప్రభువు పరమ పవిత్రుడు! నిస్సందేహంగా, మేము దుర్మార్గులము!"

فَاَقْبَلَ بَعْضُهُمْ عَلٰى بَعْضٍ يَّتَلَاوَمُوْنَ ﴿30﴾

**30.** తరువాత వారు అభిముఖులై ఒకరి నొకరు నిందించుకోసాగారు.

قَالُوْا يٰوَيْلَنَآ اِنَّا كُنَّا طٰغِيْنَ ﴿31﴾

**31.** వారన్నారు: "అయ్యో! మా దౌర్భాగ్యం! నిస్సందేహంగా, మేము మితిమీరి పోయాము!

عَسٰى رَبُّنَآ اَنْ يُّبْدِلَنَا خَيْرًا مِّنْهَآ اِنَّآ اِلٰى رَبِّنَا رٰغِبُوْنَ ﴿32﴾

**32.** "మన ప్రభువు మనకు దీనికి బదులుగా దీనికంటే శ్రేష్ఠమైన దానిని

---

5) కొందరు వ్యాఖ్యాతలు ఇక్కడ తస్బీ'హ్ అంటే **ఇన్షా'-అల్లాహ్** - అల్లాహ్ కోరితే! అనటమని వ్యాఖ్యానించారు.

شاهين 2009/1/26/بروفة أولى عربي_بروفة ثانية تلغو/A-29 Para A-T.doc

ప్రసాదించవచ్చు! నిశ్చయంగా, మనం మన ప్రభువు వైపునకు (పశ్చాత్తాపంతో) మరలుదాము!"

كَذٰلِكَ الْعَذَابُ ۭ وَلَعَذَابُ الْاٰخِرَةِ اَكْبَرُ ۘ لَوْ كَانُوْا يَعْلَمُوْنَ ۝33

**33.** ఈ విధంగా ఉంటుంది శిక్ష! మరియు పరలోక శిక్ష దీనికంటే ఘోరంగా ఉంటుంది. వారు ఇది తెలుసుకుంటే ఎంత బాగుండేది!

اِنَّ لِلْمُتَّقِيْنَ عِنْدَ رَبِّهِمْ جَنّٰتِ النَّعِيْمِ ۝34

**34.** నిశ్చయంగా, దైవభీతి గల వారికి వారి ప్రభువు వద్ద పరమానందకరమైన స్వర్గ వనాలు ఉన్నాయి.

اَفَنَجْعَلُ الْمُسْلِمِيْنَ كَالْمُجْرِمِيْنَ ۝35

**35.** ఏమీ? మేము ముస్లింలను (అల్లాహ్ కు విధేయులైన వారిని) నేరస్థులతో సమానంగా ఎంచుదుమా? [6]

مَا لَكُمْ ۣ كَيْفَ تَحْكُمُوْنَ ۝36

**36.** మీ కేమయింది? మీరెలాంటి నిర్ణయాలు చేస్తున్నారు?

اَمْ لَكُمْ كِتٰبٌ فِيْهِ تَدْرُسُوْنَ ۝37

**37.** మీ వద్ద ఏదయినా (దివ్య) గ్రంథం ఉందా? దాని నుండి మీరు నేర్చుకోవటానికి!

اِنَّ لَكُمْ فِيْهِ لَمَا تَخَيَّرُوْنَ ۝38

**38.** నిశ్చయంగా, అందులో మీకు, మీరు కోరేదంతా ఉందా?

اَمْ لَكُمْ اَيْمَانٌ عَلَيْنَا بَالِغَةٌ اِلٰى يَوْمِ الْقِيٰمَةِ ۙ اِنَّ لَكُمْ لَمَا تَحْكُمُوْنَ ۝39

**39.** లేక, పునరుత్థాన దినం వరకు, మీరు నిర్ణయించుకున్నదే మీకు తప్పక లభిస్తుందని మేము మీతో చేసిన గట్టి ప్రమాణం ఏదైనా ఉందా?

سَلْهُمْ اَيُّهُمْ بِذٰلِكَ زَعِيْمٌ ۝40

**40.** వారిలో దీనికి ఎవడు హామీగా ఉన్నాడో అడుగు.

اَمْ لَهُمْ شُرَكَاۗءُ ۚ فَلْيَاْتُوْا بِشُرَكَاۗىِٕهِمْ اِنْ كَانُوْا صٰدِقِيْنَ ۝41

**41.** లేక, వారికి ఎవరైనా (వారు అల్లాహ్‌కు కల్పించిన) భాగస్వాములు ఉన్నారా? ఒకవేళ వారు సత్యవంతులే అయితే తమ, ఆ భాగస్వాములను తీసుకురమ్మను.

---

6) ఖుర్ఆన్ అవతరణా క్రమంలో **ముస్లిం పదం** ఇక్కడ **మొట్టమొదటి సారి వచ్చింది.** ముస్లిం అంటే అల్లాహ్ (సు.త.)కు విధేయుడై, ఆయన (సు.త.) ఆజ్ఞాపించిన ఏకదైవ సిద్ధాంతంపై ఉండి, ఆరాధనను కేవలం ఆయన (సు.త.)కే ప్రత్యేకించుకొని, ఆరాధనలో ఎవ్వరినీ కూడా ఆయన(సు.త.)కు సాటిగా నిలబెట్టకుండా ఉండేవాడు. తనను తాను కేవలం అల్లాహ్ (సు.త.) దాస్యానికి మాత్రమే అంకితం చేసుకున్నవాడు. దీని మూల పదం సలాం, అంటే **శాంతి**.

| | |
|---|---|
| **42.** (జ్ఞాపకముంచుకోండి) ఏ రోజయితే పిక్క ఎముక తెరిచి వేయబడుతుందో! మరియు వారు సాష్టాంగం (సజ్దా) చేయటానికి పిలువబడతారో అప్పుడు వారు (కపట-విశ్వాసులు) అలా (సజ్దా) చేయలేరు! | يَوْمَ يُكْشَفُ عَنْ سَاقٍ وَّيُدْعَوْنَ اِلَى السُّجُوْدِ فَلَا يَسْتَطِيْعُوْنَ ﴿٤٢﴾ |
| **43.** వారి చూపులు క్రిందికి వాలిపోయి ఉంటాయి. అవమానం వారిని ఆవరించి ఉంటుంది. మరియు వాస్తవానికి వారు నిక్షేపంగా ఉన్నప్పుడు సాష్టాంగం (సజ్దా) చేయటానికి ఆహ్వానించబడేవారు! | خَاشِعَةً اَبْصَارُهُمْ تَرْهَقُهُمْ ذِلَّةٌ ؕ وَقَدْ كَانُوْا يُدْعَوْنَ اِلَى السُّجُوْدِ وَهُمْ سٰلِمُوْنَ ﴿٤٣﴾ |
| **44.** కావున నన్ను మరియు ఈ సందేశాన్ని అబద్ధమని తిరస్కరించేవారిని వదలండి. వారు గ్రహించని విధంగా మేము వారిని క్రమక్రమంగా (వినాశం వైపునకు) తీసుకొని పోతాము. [7] | فَذَرْنِىْ وَمَنْ يُّكَذِّبُ بِهٰذَا الْحَدِيْثِ ؕ سَنَسْتَدْرِجُهُمْ مِّنْ حَيْثُ لَا يَعْلَمُوْنَ ﴿٤٤﴾ |
| **45.** మరియు నేను వారికి వ్యవధి నిస్తున్నాను. నిశ్చయంగా, నా వ్యూహం బలమైనది. [8] | وَاُمْلِىْ لَهُمْ ؕ اِنَّ كَيْدِىْ مَتِيْنٌ ﴿٤٥﴾ |
| **46.** లేక, (ఓ ప్రవక్తా!) నీవు వారిని ఏదైనా ప్రతిఫలం ఇవ్వమని అడుగుతున్నావా? వారికి దాని రుణం భారమవటానికి? | اَمْ تَسْـَٔلُهُمْ اَجْرًا فَهُمْ مِّنْ مَّغْرَمٍ مُّثْقَلُوْنَ ﴿٤٦﴾ |
| **47.** లేక, వారి వద్ద ఏదైనా అగోచర జ్ఞానం ఉందా? [9] వారు దానిని వ్రాసిపెట్టడానికి? | اَمْ عِنْدَهُمُ الْغَيْبُ فَهُمْ يَكْتُبُوْنَ ﴿٤٧﴾ |
| **48.** కావున నీవు నీ ప్రభువు ఆజ్ఞ కొరకు వేచి ఉండు. మరియు నీవు, **చేపవాని** (యూనుస్) వలే వ్యవహరించకు. [10] (గుర్తుకు తెచ్చుకో) అతను దుఃఖంలో ఉన్నప్పుడు (తన ప్రభువును) మొరపెట్టుకున్నాడు. | فَاصْبِرْ لِحُكْمِ رَبِّكَ وَلَا تَكُنْ كَصَاحِبِ الْحُوْتِ ۘ اِذْ نَادٰى وَهُوَ مَكْظُوْمٌ ﴿٤٨﴾ |

---

7) చూడండి, 7:182-183.

8) **కైదున్:** పన్నుగడ, పన్నాగం, పథకం, యోజన, వ్యూహం. ఇంకా చూడండి, 10:5.

9) **'గైబున్: అగోచరం.** ఈ పదం ఖుర్ఆన్ అవతరణాక్రమంలో ఇక్కడ మొట్టమొదటి సారి వచ్చింది. ఇంకా చూడండి, **96:6.**

10) యూనుస్ ('అ.స.) యొక్క వివరాల కోసం చూడండి, 21:87 మరియు 37:140.

لَوْلَآ اَنْ تَدٰرَكَهٗ نِعْمَةٌ مِّنْ رَّبِّهٖ لَنُبِذَ بِالْعَرَآءِ وَهُوَ مَذْمُوْمٌ ﴿٤٩﴾

**49.** అతని ప్రభువు అనుగ్రహమే గనక అతనికి అందక పోయి ఉంటే, అతను అవమానకరమైన స్థితిలో (చేప కడుపులో పడి ఉండేవాడు, కాని మేము అతనిని క్షమించాము). కావున అతను చెటు (బంజరు) మైదానంలో విసరివేయబడ్డాడు.[11]

فَاجْتَبٰهُ رَبُّهٗ فَجَعَلَهٗ مِنَ الصّٰلِحِيْنَ ﴿٥٠﴾

**50.** చివరకు అతని ప్రభువు అతనిని ఎన్నుకొని సత్పురుషులలో చేర్చాడు.

وَاِنْ يَّكَادُ الَّذِيْنَ كَفَرُوْا لَيُزْلِقُوْنَكَ بِاَبْصَارِهِمْ لَمَّا سَمِعُوا الذِّكْرَ وَيَقُوْلُوْنَ اِنَّهٗ لَمَجْنُوْنٌ ﴿٥١﴾

**51.** మరియు ఈ సత్య-తిరస్కారులు, ఈ సందేశాన్ని (ఖుర్ఆన్‌ను) విన్నప్పుడు, తమ చూపులతో నీ కాళ్ళు ఊడగొడతారా అన్నట్లు (నిన్ను జారించి పడవేసేటట్లు) నిన్ను చూస్తున్నారు.[12] మరియు వారు నిన్ను (ఓ ముహమ్మద్!): "నిశ్చయంగా, ఇతడు పిచ్చి వాడు!" అని అంటున్నారు.

وَمَا هُوَ اِلَّا ذِكْرٌ لِّلْعٰلَمِيْنَ ﴿٥٢﴾

**52.** ఇది (ఈ ఖుర్ఆన్) సమస్త లోక వాసులకు కేవలం ఒక జ్ఞాపిక (హితబోధ) మాత్రమే! (**1/4**)

*****

---

11) దీని **మరొకతాత్పర్యం** ఇలా ఉంది: "ఒకవేళ అతనిపై అతని ప్రభువు (సు.త.) అనుగ్రహమే గనక లేకుంటే! నిశ్చయంగా, అతను అవమానకరమైన స్థితిలో బంజరు మైదానంలో విసరి వేయబడేవాడు." మరొక వ్యాఖ్యానం: "అల్లాహ్ (సు.త.) అతనికి పశ్చాత్తాప పడే సద్బుద్ధి గనక ఇవ్వకుండా ఉంటే మరియు అతని ప్రార్థన అంగీకరించ బడకుండా ఉంటే అతను సముద్రపు అంచున వేయబడకుండా ఉంటే – ఎక్కడైతే అతనికి ఆహారం ఇచ్చాడో మరియు తీగ పెంచాడో – బంజరు భూమిలో విసరివేయబడి ఉండే వాడు. మరియు అల్లాహ్ (సు.త.) వద్ద అతని పరిస్థితి అవమానకరమైనదై ఉండేది. కాని అతని ప్రార్థన అంగీకరించబడిన తరువాత అతను అనుగ్రహించబడ్డాడు." ఇంకా చూ. **37:143.**

12) ఒకవేళ నీకు అల్లాహ్ (సు.త.) రక్షణయే గనక లేకుంటే! వారి దిష్టి నీకు తగిలేది. (ఇబ్నె-కసీ'ర్). ఇబ్నె-కసీ'ర్ ఇంకా ఇలా వ్రాశారు. **దిష్టి** తగలటం మరియు అల్లాహ్ (సు.త.) అనుమతితో దాని వల్ల నష్టం కలగటం నిజమే. కావున 'హదీస్'లలో దీని నుండి విముక్తి పొందటానికి **దు'ఆలు** ఇవ్వబడ్డాయి మరియు ఈ సలహాలు కూడా ఇవ్వబడ్డాయి: ఏదైనా మంచి వస్తువును చూస్తే దిష్టి తగులకుండా ఉండటానికి: **'మాషాఅల్లాహ్'** లేక **'బారకల్లాహ్'** అనాలి. ఒకవేళ దిష్టి తగిలితే: దిష్టి పెట్టిన వాడు ఒక పాత్రలో స్నానంచేసి ఆ నీటిని దిష్టి తగిలినవాడి మీద పోయాలి. (ఇబ్నె-కసీ'ర్). ***

## 69. సూరహ్ అల్-'హాఖ్ఖహ్

سُوْرَةُ الْحَاقَّةِ

*అల్-'హాఖ్ఖహ్:* The Reality,The Inevitable, **అనివార్య సంఘటన**, పరమ యథా ర్థం, నిజం, **సత్యం.** (ఇది పునరుత్థానదినానికి గల మరొక పేరు). ఈ *సూరహ్* **మక్కహ్** లో, *సూరహ్ అల్-ముల్క్* **(67)**, తరువాత అవతరింపజేయబడింది. దాదాపు *హిజ్రత్‌*కు 3-4 సంవత్సరాలకు ముందు. ఇంకా చూ. 37:19, 39:68 చివరి భాగం మరియు 50:20-21. **52** *ఆయాతులున్న* ఈ *సూరహ్* పేరు **మొదటి** *ఆయత్* నుండి తీసుకోబడింది.

**అనంత కరుణామయుడు అపార కరుణాప్రదాత అయిన అల్లాహ్ పేరుతో**

**1.** * **ఆ అనివార్య సంఘటన** (పునరుత్థానం)!

**2.** ఏమిటా అనివార్యసంఘటన?

**3.** మరియు ఆ అనివార్య సంఘటన, అంటే ఏమిటో నీకేమి తెలుసు?

**4.** *స'మూద్* మరియు *'ఆద్* జాతి వారు అకస్మాత్తుగా విరుచుకుపడే ఆ ఉపద్రవాన్ని అసత్యమని తిరస్కరించారు. [1]

**5.** కావున స'మూద్ జాతివారైతే ఒక భయంకరమైన **గర్జన** ద్వారా నాశనం చేయబడ్డారు.

**6.** మరియు **ఆద్** జాతి వారేమో అతి తీవ్రమైన తుఫాను **గాలి** ద్వారా నాశనం చేయబడ్డారు.

**7.** ఆయన (అల్లాహ్), దానిని వారి మీద **ఏడు** రాత్రులు మరియు ఎనిమిది పగళ్ళ వరకు ఎడతెగకుండా ఆవతరింపజేశాడు. [2] దాని వలన వారు వేళ్ళతో పెళ్ళగించబడిన ఖర్జూరపు బోదెల వలే పాడైపోవటం (అక్కడ ఉండి ఉంటే) నీవు చూసేవాడివి!

**8.** అయితే ఇప్పుడు వారిలో ఎవరైనా మిగిలి ఉన్నట్లు నీవు చూస్తున్నావా?

بِسۡمِ اللّٰهِ الرَّحۡمٰنِ الرَّحِيۡمِ ○

اَلۡحَآقَّةُ ۙ ①

مَا الۡحَآقَّةُ ۚ ②

وَمَاۤ اَدۡرٰىكَ مَا الۡحَآقَّةُ ؕ ③

كَذَّبَتۡ ثَمُوۡدُ وَعَادٌۢ بِالۡقَارِعَةِ ④

فَاَمَّا ثَمُوۡدُ فَاُهۡلِكُوۡا بِالطَّاغِيَةِ ⑤

وَاَمَّا عَادٌ فَاُهۡلِكُوۡا بِرِيۡحٍ صَرۡصَرٍ
عَاتِيَةٍ ۙ ⑥

سَخَّرَهَا عَلَيۡهِمۡ سَبۡعَ لَيَالٍ وَّثَمٰنِيَةَ
اَيَّامٍ ۙ حُسُوۡمًا فَتَرَى الۡقَوۡمَ فِيۡهَا
صَرۡعٰى ۙ كَاَنَّهُمۡ اَعۡجَازُ نَخۡلٍ
خَاوِيَةٍ ۚ ⑦

فَهَلۡ تَرٰى لَهُمۡ مِّنۡۢ بَاقِيَةٍ ⑧

---

1) *'ఆద్* మరియు *స'మూద్* జాతుల సమాచారం కొరకు చూడండి, 7:65-79.
2) చూడండి, 7:78.

**9.** ఫిర్'ఔన్ మరియు అతనికి పూర్వం గతించిన వారూ మరియు తలక్రిందులు చేయబడిన నగరాల వారూ, [3] అందరూ నేరాలకు పాల్పడ్డారు.

وَجَآءَ فِرْعَوْنُ وَمَنْ قَبْلَهٗ وَالْمُؤْتَفِكٰتُ بِالْخَاطِئَةِ ۚ (9)

**10.** మరియు వారు తమ ప్రభువు పంపిన ప్రవక్తలకు అవిధేయత కనబరచారు. కావున ఆయన వారిని కఠినమైనపట్టుతో పట్టుకున్నాడు.

فَعَصَوْا رَسُوْلَ رَبِّهِمْ فَاَخَذَهُمْ اَخْذَةً رَّابِيَةً (10)

**11.** నిశ్చయంగా, ఎప్పుడైతే (నూహ్ తుఫాన్) నీరు హద్దులేకుండా ఉప్పొంగి పోయిందో! అప్పుడు మేము మిమ్మల్ని [4] పయనించే దానిలో (నావలో) ఎక్కించాము.

اِنَّا لَمَّا طَغَا الْمَآءُ حَمَلْنٰكُمْ فِي الْجَارِيَةِ ۙ (11)

**12.** దానిని, మీకొక హితబోధగా! మరియు జ్ఞాపకముంచుకోగల చెవులు, విని జ్ఞాపక ముంచుకునేందుకు గాను (అలా చేశాము).

لِنَجْعَلَهَا لَكُمْ تَذْكِرَةً وَّتَعِيَهَآ اُذُنٌ وَّاعِيَةٌ (12)

**13.** ఇక ఎప్పుడైతే **బాకా** ఒక్కసారి ఊదబడుతుందో! [5]

فَاِذَا نُفِخَ فِي الصُّوْرِ نَفْخَةٌ وَّاحِدَةٌ ۙ (13)

**14.** మరియు భూమి మరియు పర్వతాలు పైకి ఎత్తబడి ఒక పెద్ద దెబ్బతో తుత్తునీయలుగా చేయబడతాయో!

وَّحُمِلَتِ الْاَرْضُ وَالْجِبَالُ فَدُكَّتَا دَكَّةً وَّاحِدَةً ۙ (14)

**15.** ఆ రోజు సంభవించవలసినది, సంభవిస్తుంది.

فَيَوْمَئِذٍ وَّقَعَتِ الْوَاقِعَةُ ۙ (15)

**16.** మరియు ఆ రోజున ఆకాశం బ్రద్దలై పోతుంది మరియు దాని పట్టు సడలి పోతుంది.[6]

وَانْشَقَّتِ السَّمَآءُ فَهِيَ يَوْمَئِذٍ وَّاهِيَةٌ ۙ (16)

**17.** మరియు దైవదూతలు దాని ('అర్ష్) ప్రక్కలలో ఉంటారు. మరియు నీ ప్రభువు యొక్క సింహాసనాన్ని ('అర్ష్ ను), ఆ రోజు

وَّالْمَلَكُ عَلٰٓى اَرْجَآئِهَا ۗ وَيَحْمِلُ عَرْشَ رَبِّكَ فَوْقَهُمْ يَوْمَئِذٍ ثَمٰنِيَةٌ ۗ (17)

---

3) అంటే లూ'త్ ('అ.స.) ప్రజలు *సోడోం* మరియు *గొమొర్రాహ్* వాసులు చూ. 11:69-83.
4) మిమ్మల్ని అంటే మీ పూర్వీకులను.
5) *అల్-'హాఖ్ఖహ్*: ఏ విధంగా సంభవిస్తుందో ఇక్కడ వివరించబడుతోంది. ఇస్రాఫీల్ ('అ.స.) పెద్ద ధ్వనితో బాకా ఊదగానే అది సంభవిస్తుంది.
6) అంటే దీని అర్థం ఇలా కావచ్చు. ఆకాశంలోని గ్రహాల వ్యవస్థ సడలిపోతుంది. అవి బ్రద్ధలైపోయి వాటి మధ్యనున్న గురుత్వాకర్షణ శక్తి నశించిపోతుంది.

**ఎనిమిది** మంది (దైవదూతలు) ఎత్తుకొని ఉంటారు.

**18.** ఆ రోజు మీరు (తీర్పు కొరకు) హాజరు చేయబడతారు. మీరు దాచిన ఏ రహస్యం కూడా (ఆ రోజు) దాగి ఉండదు. [7]

يَوْمَئِذٍ تُعْرَضُوْنَ لَا تَخْفٰى مِنْكُمْ خَافِيَةٌ ⑱

**19.** ఇక ఎవరికైతే తన కర్మ పత్రము కుడి చేతిలో ఇవ్వబడుతుందో, అతడు ఇలా అంటాడు: "ఇదిగో నా కర్మపత్రాన్ని తీసుకొని చదవండి!

فَاَمَّا مَنْ اُوْتِیَ كِتٰبَهٗ بِيَمِيْنِهٖ فَيَقُوْلُ هَآؤُمُ اقْرَءُوْا كِتٰبِيَهْ ⑲

**20.** "నిశ్చయంగా, నా లెక్క నాకు తప్పకుండా లభిస్తుందని నేను భావించే వాడిని!"

اِنِّیْ ظَنَنْتُ اَنِّیْ مُلٰقٍ حِسَابِيَهْ ⑳

**21.** కావున, అతడు సంతోషకరమైన జీవితం గడుపుతాడు.

فَهُوَ فِیْ عِيْشَةٍ رَّاضِيَةٍ ㉑

**22.** అత్యున్నతమైన స్వర్గవనంలో; [8]

فِیْ جَنَّةٍ عَالِيَةٍ ㉒

**23.** దాని పండ్ల గుత్తులు, సమీపంలో వ్రేలాడుతూ ఉంటాయి.

قُطُوْفُهَا دَانِيَةٌ ㉓

**24.** (వారితో ఇలా అనబడుతుంది): "గడిచి పోయిన దినాలలో మీరు చేసి పంపిన కర్మలకు ప్రతిఫలంగా, ఇప్పుడు మీరు హాయిగా తినండి మరియు త్రాగండి!"

كُلُوْا وَاشْرَبُوْا هَنِيْٓـًٔا بِمَآ اَسْلَفْتُمْ فِی الْاَيَّامِ الْخَالِيَةِ ㉔

**25.** ఇక ఎవడికైతే, తన కర్మ పత్రం ఎడమ చేతికి ఇవ్వబడుతుందో, అతడు ఇలా వాపోతాడు: "అయ్యో నా పాడుగాను! నా కర్మపత్రం అసలు నాకు ఇవ్వబడకుండా ఉంటే ఎంత బాగుండేది!

وَاَمَّا مَنْ اُوْتِیَ كِتٰبَهٗ بِشِمَالِهٖ فَيَقُوْلُ يٰلَيْتَنِیْ لَمْ اُوْتَ كِتٰبِيَهْ ㉕

**26.** "మరియు నా లెక్క ఏమిటో నాకు తెలియకుంటే ఎంత బాగుండేది!

وَلَمْ اَدْرِ مَا حِسَابِيَهْ ㉖

---

7) అంటే 'హాజరు చేయబడి, ప్రతివాని కర్మపత్రాలు అతని చేతికిచ్చి వాటి ఆధారంగా అతని తీర్పు జరుగుతుంది. ఆ తీర్పు ప్రకారం అతడు తన గమ్యస్థానానికి (స్వర్గం లేక నరకానికి) పంపబడతాడు.

8) స్వర్గంలో **ఎనిమిది** దరజాలు ఉన్నాయి. దరజా అంటే వర్గం, క్రమం, శ్రేణి, కక్ష్య, లేక తరగతి.

يٰلَيْتَهَا كَانَتِ الْقَاضِيَةَ ﴿27﴾

**27.** "అయ్యో, నా పాడుగాను! అది (ఆ మరణమే) నాకు అంతిమ మరణమై ఉంటే ఎంత బాగుండేది!

مَآ اَغْنٰى عَنِّىْ مَالِيَهْ ﴿28﴾

**28.** "నా సంపద నాకేమీ పనికి రాలేదు;

هَلَكَ عَنِّىْ سُلْطٰنِيَهْ ﴿29﴾

**29.** "నా అధికారమంతా అంతమై పోయింది!"

خُذُوْهُ فَغُلُّوْهُ ﴿30﴾

**30.** (అప్పుడు ఇలా ఆజ్ఞ ఇవ్వబడు తుంది): "అతన్ని పట్టుకోండి మరియు అతని మెడలో సంకెళ్ళు వేయండి; [9]

ثُمَّ الْجَحِيْمَ صَلُّوْهُ ﴿31﴾

**31.** "తరువాత అతనిని భగభగ మండే నరకాగ్నిలో వేయండి.

ثُمَّ فِىْ سِلْسِلَةٍ ذَرْعُهَا سَبْعُوْنَ ذِرَاعًا فَاسْلُكُوْهُ ﴿32﴾

**32.** "ఆ తరువాత అతనిని డెబ్భై మూరల పొడువుగల గొలుసుతో బంధించండి!" [10]

اِنَّهٗ كَانَ لَا يُؤْمِنُ بِاللّٰهِ الْعَظِيْمِ ﴿33﴾

**33.** వాస్తవానికి అతడు సర్వోత్తముడైన అల్లాహ్‌ను విశ్వసించేవాడు కాదు.

وَلَا يَحُضُّ عَلٰى طَعَامِ الْمِسْكِيْنِ ﴿34﴾

**34.** మరియు నిరుపేదలకు ఆహారం పెట్టమని ప్రోత్సహించేవాడు కాదు.

فَلَيْسَ لَهُ الْيَوْمَ هٰهُنَا حَمِيْمٌ ﴿35﴾

**35.** కావున, ఈ నాడు అతనికి ఇక్కడ ఏ స్నేహితుడూ లేడు;

وَّلَا طَعَامٌ اِلَّا مِنْ غِسْلِيْنٍ ﴿36﴾

**36.** మరియు అసహ్యాకరమైన గాయాల కడుగు తప్ప, మరొక ఆహారమూ లేదు!

لَّا يَاْكُلُهٗٓ اِلَّا الْخٰطِئُوْنَ ﴿37﴾

**37.** దానిని పాపులు తప్ప మరెవ్వరూ తినరు!

فَلَآ اُقْسِمُ بِمَا تُبْصِرُوْنَ ﴿38﴾

**38.** కావున, నేను మీరు చూడగలిగే వాటి ప్రమాణం చేస్తున్నాను;

وَمَا لَا تُبْصِرُوْنَ ﴿39﴾

**39.** మరియు మీరు చూడలేనట్టి వాటి (ప్రమాణం) కూడా!

اِنَّهٗ لَقَوْلُ رَسُوْلٍ كَرِيْمٍ ﴿40﴾

**40.** నిశ్చయంగా, ఇది (ఈ ఖుర్ఆన్) గౌరవనీయుడైన సందేశహరుడు (ముహమ్మద్ పై అవతరింపజేయబడిన / జిబ్రీల్ అల్లాహ్ తరఫు నుండి తెచ్చిన దైవ) వాక్కు.

---

9) *'గుల్లూహ్*: అతనికి సంకెళ్ళు వేయండి. చూడండి, 13:5, 34:33, 36:8, 40:71.
10) చూడండి, 14:49.

***

| | |
|---|---|
| **41.** మరియు ఇది ఒక కవి యొక్క వాక్కు కాదు. మీరు విశ్వసించేది చాలా తక్కువ. | وَّمَا هُوَ بِقَوْلِ شَاعِرٍ ۗ قَلِيْلًا مَّا تُؤْمِنُوْنَ ﴿41﴾ |
| **42.** మరియు ఇది ఏ జ్యోతిష్యుని వాక్కు కూడా కాదు! మీరు హితబోధను గ్రహించేది చాలా తక్కువ. | وَلَا بِقَوْلِ كَاهِنٍ ۗ قَلِيْلًا مَّا تَذَكَّرُوْنَ ﴿42﴾ |
| **43.** ఇది సర్వలోకాల ప్రభువు తరఫు నుండి అవతరింపజేయబడింది. | تَنْزِيْلٌ مِّنْ رَّبِّ الْعٰلَمِيْنَ ﴿43﴾ |
| **44.** ఒకవేళ ఇతను (ఈ ప్రవక్త), మా (అల్లాహ్‌ను) గురించి ఏదైనా అబద్ధపు మాట కల్పించి ఉంటే! | وَلَوْ تَقَوَّلَ عَلَيْنَا بَعْضَ الْاَقَاوِيْلِ ﴿44﴾ |
| **45.** మేము అతని కుడిచేతిని పట్టుకునే వారం. | لَاَخَذْنَا مِنْهُ بِالْيَمِيْنِ ﴿45﴾ |
| **46.** తరువాత అతని కంఠ నాళాన్ని కోసివేసే వారం. | ثُمَّ لَقَطَعْنَا مِنْهُ الْوَتِيْنَ ﴿46﴾ |
| **47.** అప్పుడు మీలో నుండి ఏ ఒక్కడు కూడా అతనిని (మా శిక్ష నుండి) కాపాడలేక పోయేవాడు. | فَمَا مِنْكُمْ مِّنْ اَحَدٍ عَنْهُ حٰجِزِيْنَ ﴿47﴾ |
| **48.** మరియు నిశ్చయంగా, ఇది (ఈ ఖుర్ఆన్) దైవభీతి గల వారి కొరకు హితోపదేశం. | وَاِنَّهٗ لَتَذْكِرَةٌ لِّلْمُتَّقِيْنَ ﴿48﴾ |
| **49.** మరియు నిశ్చయంగా మీలో కొందరు దీనిని (ఈ ఖుర్ఆన్‌ను) అసత్యమని అనే వారు ఉన్నారని మాకు బాగా తెలుసు. | وَاِنَّا لَنَعْلَمُ اَنَّ مِنْكُمْ مُّكَذِّبِيْنَ ﴿49﴾ |
| **50.** మరియు నిశ్చయంగా ఇది (ఈ తిరస్కారం) సత్య-తిరస్కారులకు దుఃఖ కారణమవుతుంది. | وَاِنَّهٗ لَحَسْرَةٌ عَلَى الْكٰفِرِيْنَ ﴿50﴾ |
| **51.** మరియు నిశ్చయంగా, ఇది (ఈ ఖుర్ఆన్) నమ్మదగిన సత్యం. | وَاِنَّهٗ لَحَقُّ الْيَقِيْنِ ﴿51﴾ |
| **52.** కావున సర్వోత్తముడైన నీ ప్రభువు నామాన్ని స్తుతించు. | فَسَبِّحْ بِاسْمِ رَبِّكَ الْعَظِيْمِ ﴿52﴾ |

*****

## 70. సూరహ్ అల్-మ'ఆరిజ్

سُورَةُ الْمَعَارِج

*అల్-మ'ఆరిజ్:* The Ways of Ascent, **ఆరోహణ,** అధిరోహణ, ఊర్ధ్వగమనం, లేక పైకి వెళ్ళే మార్గాలు. ఇది మధ్య **మక్కహ్** కాలపు *సూరహ్.* **44** ఆయాతులున్న ఈ *సూరహ్* పేరు **3**వ *ఆయత్* నుండి తీసుకోబడింది.

**అనంత కరుణామయుడు అపార కరుణాప్రదాత అయిన అల్లాహ్ పేరుతో**

بِسْمِ اللّٰهِ الرَّحْمٰنِ الرَّحِيْمِ ○

**1.** ప్రశ్నించే వాడు, [1] వాటిల్లే శిక్షను గురించి ప్రశ్నించాడు;

سَاَلَ سَآئِلٌۢ بِعَذَابٍ وَّاقِعٍ ①

**2.** సత్య-తిరస్కారులకు విధించబడే దాని గురించి; దానిని ఎవ్వడూ తొలగించలేడు.

لِّلْكٰفِرِيْنَ لَيْسَ لَهٗ دَافِعٌ ②

**3.** అది **ఆరోహణ** మార్గాలకు యజమానుడైన అల్లాహ్ తరఫు నుండి వస్తుంది. [2]

مِّنَ اللّٰهِ ذِى الْمَعَارِجِ ③

**4. యాభైవేల** సంవత్సరాలకు సమానమైన (పరిమాణం గల) ఒక రోజులో, [3] దైవదూతలు మరియు ఆత్మ (జిబ్రీల్) [4] ఆయన వద్దకు అధిరోహిస్తారు.

تَعْرُجُ الْمَلٰٓئِكَةُ وَالرُّوْحُ اِلَيْهِ فِىْ يَوْمٍ كَانَ مِقْدَارُهٗ خَمْسِيْنَ اَلْفَ سَنَةٍ ④

**5.** కావున (ఓ ము'హమ్మద్!) నీవు మంచిగా సహనం వహించు!

فَاصْبِرْ صَبْرًا جَمِيْلًا ⑤

---

1) ఈ ప్రశ్నించే, సత్య-తిరస్కారి న'దర్ బిన్-'హారిస్' లేక అబూ-జహల్ కావచ్చని వ్యాఖ్యాతలు అభిప్రాయపడ్డారు. చూడండి, 8:32. అతడు బద్ర్ యుద్ధంలో చంపబడ్డాడు.

2) చూడండి, 76:3.

3) చూడండి, 22:47. అక్కడ నీ ప్రభువు దృష్టిలో ఒక దినము మీరు లెక్కించే వేయి సంవత్సరాలకు సమానము. ఇంకా చూడండి, 32:5. అల్లాహ్ (సు.త.) అనంతుడు, అపారుడు, అంతము లేనివాడు, కాలపరిమితికి అతీతుడు. పరలోక జీవితంలో మానవునికి కూడా కాలమనే దానికి ఎలాంటి అర్థం ఉండదు.

4) *రూ'హ్:* దీనిని ఇక్కడ కొందరు వ్యాఖ్యాతలు జిబ్రీల్ ('అ.స.) అన్నారు. మరికొందరు మానవుల ఆత్మలన్నారు. చూడండి, 19:17 వ్యాఖ్యానం-6.

| | |
|---|---|
| **6.** వాస్తవానికి, వారు (ప్రజలు) అది (ఆ దినం) దూరంగా ఉందని అనుకుంటున్నారు. | إِنَّهُمۡ يَرَوۡنَهُۥ بَعِيدٗا ⑥ |
| **7.** మరియు మేము దాన్ని దగ్గరగా చూస్తున్నాము. | وَنَرَىٰهُ قَرِيبٗا ⑦ |
| **8.** ఆ రోజు ఆకాశం మరిగే సీసం వలే (నూనె వలే) అయిపోతుంది; | يَوۡمَ تَكُونُ ٱلسَّمَآءُ كَٱلۡمُهۡلِ ⑧ |
| **9.** మరియు కొండలు ఏకిన ఉన్నివలె అయిపోతాయి.[5] | وَتَكُونُ ٱلۡجِبَالُ كَٱلۡعِهۡنِ ⑨ |
| **10.** మరియు ప్రాణ స్నేహితుడు కూడా తన స్నేహితుని (క్షేమాన్ని) అడగడు. | وَلَا يَسۡـَٔلُ حَمِيمٌ حَمِيمٗا ⑩ |
| **11.** వారు ఒకరినొకరు చూసుకుంటూ ఉంటారు. ఆరోజు అపరాధి తన సంతానాన్ని పరిహారంగా ఇచ్చి అయినా శిక్ష నుండి తప్పించుకోగోరుతాడు; | يُبَصَّرُونَهُمۡۚ يَوَدُّ ٱلۡمُجۡرِمُ لَوۡ يَفۡتَدِي مِنۡ عَذَابِ يَوۡمِئِذِۭ بِبَنِيهِ ⑪ |
| **12.** మరియు తన సహవాసిని మరియు తన సోదరుణ్ణి; | وَصَٰحِبَتِهِۦ وَأَخِيهِ ⑫ |
| **13.** మరియు తనకు ఆశ్రయమిచ్చిన దగ్గరి బంధువులను; | وَفَصِيلَتِهِ ٱلَّتِي تُـٔۡوِيهِ ⑬ |
| **14.** మరియు భూమిలో ఉన్న వారినందరినీ కూడా ఇచ్చి అయినా, తాను విముక్తి పొందాలని కోరుతాడు. | وَمَن فِي ٱلۡأَرۡضِ جَمِيعٗا ثُمَّ يُنجِيهِ ⑭ |
| **15.** కాని అలా కానేరదు! నిశ్చయంగా ఆ మండే అగ్నిజ్వాల (అతని కొరకు వేచి ఉంటుంది)! | كَلَّآۖ إِنَّهَا لَظَىٰ ⑮ |
| **16.** అది అతని చర్మాన్ని పూర్తిగా వలచి కాల్చివేస్తుంది. | نَزَّاعَةٗ لِّلشَّوَىٰ ⑯ |
| **17.** అది (సత్యం నుండి) వెనుదిరిగి మరియు వెన్నుచూపి, పోయే వారిని (అందరినీ) పిలుస్తుంది. | تَدۡعُواْ مَنۡ أَدۡبَرَ وَتَوَلَّىٰ ⑰ |
| **18.** మరియు (ధనాన్ని) కూడబెట్టి, దానిని దాచే వారిని. (3/8) | وَجَمَعَ فَأَوۡعَىٰٓ ⑱ |

---

5) చూడండి, 101:5 ఇటువంటి ఆయతోకు.

| | |
|---|---|
| **19.** * నిశ్చయంగా మానవుడు **ఆత్రగాడుగా** (తొందరపడే వాడిగా) సృష్టించ బడ్డాడు; | اِنَّ الْاِنْسَانَ خُلِقَ هَلُوْعًا ⑲ |
| **20.** తనకు కీడు కలిగినప్పుడు వాడు ఆందోళన చెందుతాడు; | اِذَا مَسَّهُ الشَّرُّ جَزُوْعًا ⑳ |
| **21.** మరియు తనకు మేలు కలిగినపుడు స్వార్థపరునిగా ప్రవర్తిస్తాడు. | وَّاِذَا مَسَّهُ الْخَيْرُ مَنُوْعًا ㉑ |
| **22.** *నమా'జ్*ను ఖచ్చితంగా పాటించే వారు తప్ప! | اِلَّا الْمُصَلِّيْنَ ㉒ |
| **23.** వారే తమ *నమా'జులను* సదా పాటిస్తారు; | الَّذِيْنَ هُمْ عَلٰى صَلَاتِهِمْ دَآىِٕمُوْنَ ㉓ |
| **24.** మరియు అలాంటి వారు, ఎవరైతే తమ సంపదలలో (ఇతరులకు) ఉన్న హక్కును సమ్మతిస్తారో! [6] | وَالَّذِيْنَ فِيْٓ اَمْوَالِهِمْ حَقٌّ مَّعْلُوْمٌ ㉔ |
| **25.** యాచకులకు మరియు లేమికి గురి అయిన వారికి; [7] | لِّلسَّآىِٕلِ وَالْمَحْرُوْمِ ㉕ |
| **26.** మరియు వారు తీర్పు (ప్రతిఫల) దినమును దృఢంగా నమ్మేవారై ఉంటారు; | وَالَّذِيْنَ يُصَدِّقُوْنَ بِيَوْمِ الدِّيْنِ ㉖ |
| **27.** మరియు వారు తమ ప్రభువు శిక్ష నుండి భయపడుతుంటారు! | وَالَّذِيْنَ هُمْ مِّنْ عَذَابِ رَبِّهِمْ مُّشْفِقُوْنَ ㉗ |
| **28.** నిశ్చయంగా, వారి ప్రభువు యొక్క శిక్ష; నిర్భయంగా ఉండదగినది కాదు. | اِنَّ عَذَابَ رَبِّهِمْ غَيْرُ مَاْمُوْنٍ ㉘ |
| **29.** మరియు వారు, తమ మర్మాంగాలను కాపాడుకుంటారు – | وَالَّذِيْنَ هُمْ لِفُرُوْجِهِمْ حٰفِظُوْنَ ㉙ |
| **30.** తమ భార్యలతో (*అ'జ్వాజ్‌లతో*), లేక తమ ఆధీనంలో (కుడి చేతిలో) ఉన్న బానిస స్త్రీలతో తప్ప [8] – అలాంటప్పుడు వారు నిశ్చయంగా, నిందార్హులు కారు. | اِلَّا عَلٰٓى اَزْوَاجِهِمْ اَوْ مَا مَلَكَتْ اَيْمَانُهُمْ فَاِنَّهُمْ غَيْرُ مَلُوْمِيْنَ ㉚ |

6) అంటే, '*జకాత్* మరియు ఇతర దానధర్మాలు చేసేవారు.
7) ఇటువంటి *ఆయత్‌కై* చూడండి, 51:19.
8) యుద్ధం (*జిహాద్*)లో ఖైదీలుగా పట్టుబడ్డవారే బానిసలు, కనుక ఈ కాలంలో, ఇస్లాం నిర్దేశం ప్రకారం, బానిసలు అనబడేవారు అసలు లేరు. ఇంకా చూడండి, 23:5-7, 4:3.

فَمَنِ ابْتَغٰى وَرَآءَ ذٰلِكَ فَاُولٰٓئِكَ هُمُ الْعٰدُوْنَ ﴿31﴾

**31.** కాని ఎవరైతే దీనిని మించి కోరుతారో! అలాంటివారే హద్దులను అతిక్రమించిన వారు.

وَالَّذِيْنَ هُمْ لِاَمٰنٰتِهِمْ وَعَهْدِهِمْ رٰعُوْنَ ﴿32﴾

**32.** మరియు ఎవరైతే తమ పూచీలను (అమానతులను) మరియు తమ వాగ్దానాలను కాపాడు కుంటారో;

وَالَّذِيْنَ هُمْ بِشَهٰدٰتِهِمْ قَآئِمُوْنَ ﴿33﴾

**33.** మరియు ఎవరైతే తమ సాక్ష్యాల మీద స్థిరంగా ఉంటారో;

وَالَّذِيْنَ هُمْ عَلٰى صَلَاتِهِمْ يُحَافِظُوْنَ ﴿34﴾

**34.** మరియు ఎవరైతే తమ నమాజులను కాపాడుకుంటారో;

اُولٰٓئِكَ فِيْ جَنّٰتٍ مُّكْرَمُوْنَ ﴿35﴾

**35.** ఇలాంటి వారంతా సగౌరవంగా స్వర్గవనాలలో ఉంటారు.

فَمَالِ الَّذِيْنَ كَفَرُوْا قِبَلَكَ مُهْطِعِيْنَ ﴿36﴾

**36.** ఈ సత్య-తిరస్కారులకు ఏమయింది? వీరెందుకు హడావిడిగా, నీ ముందు ఇటూ అటూ తిరుగుతున్నారు?

عَنِ الْيَمِيْنِ وَعَنِ الشِّمَالِ عِزِيْنَ ﴿37﴾

**37.** కుడి ప్రక్క నుండి మరియు ఎడమ ప్రక్క నుండి గుంపులు-గుంపులుగా; [9]

اَيَطْمَعُ كُلُّ امْرِئٍ مِّنْهُمْ اَنْ يُّدْخَلَ جَنَّةَ نَعِيْمٍ ﴿38﴾

**38.** ఏమీ? వారిలో ప్రతి ఒక్కడూ, తాను పరమ సుఖాలు గల స్వర్గవనంలో ప్రవేశింప జేయబడతానని ఆశిస్తున్నాడా?

كَلَّا ؕ اِنَّا خَلَقْنٰهُمْ مِّمَّا يَعْلَمُوْنَ ﴿39﴾

**39.** అలా కానేరదు! నిశ్చయంగా, మేము వారిని దేనితో పుట్టించామో వారికి బాగా తెలుసు!

فَلَآ اُقْسِمُ بِرَبِّ الْمَشٰرِقِ وَالْمَغٰرِبِ اِنَّا لَقٰدِرُوْنَ ﴿40﴾

**40.** కావున! నేను తూర్పుల మరియు పడమరల ప్రభువు శపథంచేసి చెబుతున్నాను.[10]

---

9) దైవప్రవక్త ('స'అ.స.) కాలంలో సత్య-తిరస్కారులు అతని ('స'అ.స.) సమావేశాలలో వచ్చేవారు. కాని అతని ('స'అ.స.) మాటలు విని, వాటిని ఆచరించక ఎగతాళిచేస్తూ గుంపులు-గుంపులుగా వెళ్ళిపోయేవారు. మీరు (విశ్వాసులు) కాదు, మేమే స్వర్గంలోకి ప్రవేశిస్తాము, అని అనేవారు.

10) చూ. 37:5, 55:17 తూర్పులూ మరియు పడమరలూ అంటే ఒక సంవత్సరపు కాలంలో ప్రతిరోజు సూర్యుడు ఒక కొత్త స్థానం నుండి ఉదయిస్తాడు మరియు ఒక కొత్త

నిశ్చయంగా, మేము అలా చేయ గల సమర్థులము –

عَلٰۤى اَنْ نُّبَدِّلَ خَيْرًا مِّنْهُمْ ۙ وَمَا نَحْنُ بِمَسْبُوْقِيْنَ ﴿41﴾

**41.** వారికి బదులుగా వారికంటే ఉత్తమమైన వారిని వారిస్థానంలో తీసుకురావటానికి – మరియు మమ్మల్ని మించిపోయేవారు ఎవ్వరూలేరు.

فَذَرْهُمْ يَخُوْضُوْا وَيَلْعَبُوْا حَتّٰى يُلٰقُوْا يَوْمَهُمُ الَّذِىْ يُوْعَدُوْنَ ﴿42﴾

**42.** వారికి వాగ్దానం చేయబడిన ఆ దినాన్ని, వారు దర్శించే వరకు వారిని – వారి వాదోపవాదాలలో మరియు వారి క్రీడలలో – మునిగి ఉండనీ!

يَوْمَ يَخْرُجُوْنَ مِنَ الْاَجْدَاثِ سِرَاعًا كَاَنَّهُمْ اِلٰى نُصُبٍ يُّوْفِضُوْنَ ﴿43﴾

**43.** ఆ రోజు వారు తమ సమాధులనుండి లేచి, తమ గమ్యస్థానాలకు చేరుకోవటానికి తొందరపడుతూ వేగంగా బయటికి వస్తారు.

خَاشِعَةً اَبْصَارُهُمْ تَرْهَقُهُمْ ذِلَّةٌ ؕ ذٰلِكَ الْيَوْمُ الَّذِىْ كَانُوْا يُوْعَدُوْنَ ﴿44﴾

**44.** వారి చూపులు క్రిందికి వాలి ఉంటాయి, అవమానం వారిని క్రమ్ముకొని ఉంటుంది. అదే వారికి వాగ్దానం చేయబడిన దినం!

*****

స్థానంలో అస్తమిస్తాడు. మరొక వ్యాఖ్యాన మేమిటంటే భూగోళంలోని విభిన్న భాగాలలో సూర్యుడు వేర్వేరు సమయాలలో వరుసగా ఉదయిస్తూ, అస్తమిస్తూ ఉంటాడు. ***

## 71. సూరహ్ నూ'హ్

سُوْرَةُ نُوْحٍ

ఖుర్ఆన్‌లో **నూ'హ్** 'అ.స. (Noah) ప్రస్తావన ఎన్నోసార్లు వచ్చింది. ఈ *సూరహ్* మొదటి **మక్కహ్** కాలంలో అవతరింపజేయబడింది. చూడండి, 11:25. **28** *ఆయాతులున్న* ఈ *సూరహ్* పేరు **మొదటి** *ఆయత్* నుండి తీసుకోబడింది.

بِسۡمِ اللّٰهِ الرَّحۡمٰنِ الرَّحِيۡمِ ○

**అనంత కరుణామయుడు అపార కరుణాప్రదాత అయిన అల్లాహ్ పేరుతో**

اِنَّاۤ اَرۡسَلۡنَا نُوۡحًا اِلٰى قَوۡمِهٖۤ اَنۡ اَنۡذِرۡ قَوۡمَكَ مِنۡ قَبۡلِ اَنۡ يَّاۡتِيَهُمۡ عَذَابٌ اَلِيۡمٌ ①

**1.** నిశ్చయంగా, మేము **నూ'హ్**‌ను, అతని జాతి వారి వద్దకు: "వారిపై బాధాకరమైన శిక్ష రాకముందే వారిని హెచ్చరించు!" అని (ఆజ్ఞాపించి) పంపాము.

قَالَ يٰقَوۡمِ اِنِّىۡ لَـكُمۡ نَذِيۡرٌ مُّبِيۡنٌ ②

**2.** అతను వారితో ఇలా అన్నాడు: "ఓ నా జాతి ప్రజలారా! నిశ్చయంగా, నేను మీకు స్పష్టంగా హెచ్చరిక చేయటానికి వచ్చిన వాడిని!

اَنِ اعۡبُدُوا اللّٰهَ وَاتَّقُوۡهُ وَاَطِيۡعُوۡنِ ③

**3.** "కావున మీరు అల్లాహ్‌నే ఆరాధించండి మరియు ఆయన యందు భయభక్తులు కలిగి ఉండండి మరియు నన్ను అనుసరించండి.

يَغۡفِرۡ لَـكُمۡ مِّنۡ ذُنُوۡبِكُمۡ وَيُؤَخِّرۡكُمۡ اِلٰٓى اَجَلٍ مُّسَمًّى ؕ اِنَّ اَجَلَ اللّٰهِ اِذَا جَآءَ لَا يُؤَخَّرُ ۘ لَوۡ كُنۡتُمۡ تَعۡلَمُوۡنَ ④

**4.** "అలా చేస్తే ఆయన మీ పాపాలను క్షమిస్తాడు. మరియు ఒక నియమిత కాలం వరకు మిమ్మల్ని వదలిపెడ్తాడు. నిశ్చయంగా, అల్లాహ్ నిర్ణయించిన కాలం వచ్చినపుడు, దానిని తప్పించడం సాధ్యం కాదు (అది వాయిదా వేయబడదు). ఇది మీరు తెలుసుకుంటే ఎంత బాగుండేది!"

قَالَ رَبِّ اِنِّىۡ دَعَوۡتُ قَوۡمِىۡ لَيۡلًا وَّنَهَارًا ⑤

**5.** అతను ఇలా ప్రార్థించాడు: "ఓ నా ప్రభూ! నిశ్చయంగా, నేను నా జాతివారిని రేయింబవళ్ళు పిలిచాను;

**6.** "కాని, నా పిలుపు, వారి పలాయనాన్ని మాత్రమే హెచ్చించింది.

فَلَمْ يَزِدْهُمْ دُعَآءِيۡۤ اِلَّا فِرَارًا ⑥

**7.** "మరియు వాస్తవానికి, నేను వారిని, నీ క్షమాభిక్ష వైపునకు పిలిచినప్పుడల్లా, వారు తమ చెవులలో వ్రేళ్ళు దూర్చుకునేవారు మరియు తమ వస్త్రాలను తమపై కప్పుకునే వారు మరియు వారు మొండి వైఖరి అవలంబిస్తూ దురహంకారంలో మునిగి ఉండేవారు.

وَاِنِّيۡ كُلَّمَا دَعَوۡتُهُمۡ لِتَغۡفِرَ لَهُمۡ جَعَلُوۡۤا اَصَابِعَهُمۡ فِيۡۤ اٰذَانِهِمۡ وَاسۡتَغۡشَوۡا ثِيَابَهُمۡ وَاَصَرُّوۡا وَاسۡتَكۡبَرُوا اسۡتِكۡبَارًا ۚ ⑦

**8.** "తరువాత వాస్తవానికి, నేను వారిని ఎలుగెత్తి పిలిచాను.

ثُمَّ اِنِّيۡ دَعَوۡتُهُمۡ جِهَارًا ۙ ⑧

**9.** "ఆ తరువాత వాస్తవంగా, నేను వారికి బహిరంగంగా చాటి చెప్పాను మరియు ఏకాంతంలో రహస్యంగా కూడా చెప్పాను.

ثُمَّ اِنِّيۡۤ اَعۡلَنۡتُ لَهُمۡ وَاَسۡرَرۡتُ لَهُمۡ اِسۡرَارًا ۙ ⑨

**10.** "ఇంకా వారితో ఇలా అన్నాను: 'మీ ప్రభువును క్షమాపణకై వేడుకోండి, నిశ్చయంగా, ఆయన ఎంతో క్షమాశీలుడు!

فَقُلۡتُ اسۡتَغۡفِرُوۡا رَبَّكُمۡ ؕ اِنَّهٗ كَانَ غَفَّارًا ۙ ⑩

**11.** 'ఆయన మీపై ఆకాశం నుండి ధారాళంగా వర్షాన్ని కురిపింపజేస్తాడు. [1]

يُّرۡسِلِ السَّمَآءَ عَلَيۡكُمۡ مِّدۡرَارًا ۙ ⑪

**12.** 'మరియు మీకు ధన సంపదలలోను మరియు సంతానంలోను వృద్ధినొసంగుతాడు మరియు మీ కొరకు తోటలను ఉత్పత్తి చేస్తాడు మరియు నదులను ప్రవహింపజేస్తాడు.' "

وَّيُمۡدِدۡكُمۡ بِاَمۡوَالٍ وَّبَنِيۡنَ وَيَجۡعَلۡ لَّكُمۡ جَنّٰتٍ وَّيَجۡعَلۡ لَّكُمۡ اَنۡهٰرًا ؕ ⑫

**13.** మీ కేమయింది? మీరు అల్లాహ్ మహత్త్వమును ఎందుకు ఆదరించరు (ఔన్నత్యానికి భయపడరు)? [2]

مَا لَكُمۡ لَا تَرۡجُوۡنَ لِلّٰهِ وَقَارًا ۚ ⑬

---

1) ఈ *ఆయత్* ఆధారంగా కొందరు విద్వాంసులు ఈ *సూరహ్‌*ను **వర్షం కొరకు** చేసే *నమా'జ్‌*లో చదువటం *ముస్త'హబ్* అని అంటారు. ఇటువంటి *ఆయత్* కోసం చూ. 11:52.

2) *వఖారున్:* మహత్త్వం, ప్రభావం, ప్రతాపం, ఘనత. *రజా:* అంటే లక్ష్యపెట్టు, ఆదరించు భయపడు.

وَقَدْ خَلَقَكُمْ اَطْوَارًا ⑭

14. మరియు వాస్తవానికి ఆయనే, మిమ్మల్ని వివిధ దశలలో సృష్టించాడు.[3]

اَلَمْ تَرَوْا كَيْفَ خَلَقَ اللّٰهُ سَبْعَ سَمٰوٰتٍ طِبَاقًا ⑮

15. ఏమీ? మీరు చూడటం లేదా? అల్లాహ్ ఏడు ఆకాశాలను ఏ విధంగా అంతస్తులలో సృష్టించాడో![4]

وَّجَعَلَ الْقَمَرَ فِيْهِنَّ نُوْرًا وَّجَعَلَ الشَّمْسَ سِرَاجًا ⑯

16. మరియు వాటి మధ్య చంద్రుణ్ణి (ప్రతిబింబించే) కాంతిగాను మరియు సూర్యుణ్ణి (వెలిగే) దీపంగాను చేశాడు![5]

وَاللّٰهُ اَنْۢبَتَكُمْ مِّنَ الْاَرْضِ نَبَاتًا ⑰

17. మరియు అల్లాహ్ యే మిమ్మల్ని భూమి (మట్టి) నుండి[6] ఉత్పత్తిచేశాడు!

ثُمَّ يُعِيْدُكُمْ فِيْهَا وَيُخْرِجُكُمْ اِخْرَاجًا ⑱

18. తరువాత ఆయన మిమ్మల్ని అందు లోకే తీసుకొని పోతాడు మరియు మిమ్మల్ని దాని నుండి (బ్రతికించి) బయటికి తీస్తాడు!

وَاللّٰهُ جَعَلَ لَكُمُ الْاَرْضَ بِسَاطًا ⑲

19. మరియు అల్లాహ్ యే మీ కొరకు భూమిని విస్తరింపజేశాడు.

لِّتَسْلُكُوْا مِنْهَا سُبُلًا فِجَاجًا ⑳

20. మీరు దానిపై నున్న విశాలమైన మార్గాలలో నడవటానికి.

قَالَ نُوْحٌ رَّبِّ اِنَّهُمْ عَصَوْنِيْ وَاتَّبَعُوْا مَنْ لَّمْ يَزِدْهُ مَالُهٗ وَوَلَدُهٗٓ اِلَّا خَسَارًا ㉑

21. నూ'హ్ ఇంకా ఇలా విన్నవించు కున్నాడు: "ఓ నా ప్రభూ! వాస్తవానికి, వారు నా మాటను ధిక్కరించారు. మరియు వాడిని అనుసరించారు, ఎవడి సంపద మరియు సంతానం వారికి కేవలం నష్టం తప్ప మరేమి అధికంచేయదో!

وَمَكَرُوْا مَكْرًا كُبَّارًا ㉒

22. "మరియు వారు పెద్ద కుట్ర పన్నారు.[7]

---

3) చూడండి, 22:5, 23:14 మొదలైనవి.
4) చూడండి, 67:3.
5) చూడండి, 10:5.
6) అంటే భూమిలో ఉన్న మూల పదార్థాల నుండి.
7) నూ'హ్ ('అ.స.)ను చంపటానికి కుట్రపన్నారని కొందరి అభిప్రాయం.

**23.** "మరియు వారు ఒకరితోనొకరు ఇలా అనుకున్నారు: 'మీరు మీ ఆరాధ్యదైవాలను విడిచి పెట్టకండి. *వద్ద్, సువా'అ; యఘూస్, య'ఊఖ్* మరియు *నస్ర్*లను విడిచి పెట్టకండి!'

وَقَالُوْا لَا تَذَرُنَّ اٰلِهَتَكُمْ وَلَا
تَذَرُنَّ وَدًّا وَّلَا سُوَاعًا ۙ وَّلَا يَغُوْثَ
وَيَعُوْقَ وَنَسْرًا ۚ ﴿٢٣﴾

**24.** "మరియు వాస్తవానికి, వారు చాలా మందిని తప్పు దారిలో పడవేశారు. కావున (ఓ నా ప్రభూ!): "నీవు కూడా ఈ దుర్మార్గులకు కేవలం వారి మార్గభ్రష్టత్వాన్నే హెచ్చించు!"

وَقَدْ اَضَلُّوْا كَثِيْرًا ۚ وَلَا تَزِدِ
الظّٰلِمِيْنَ اِلَّا ضَلٰلًا ﴿٢٤﴾

**25.** వారు తమ పాపాల కారణంగా ముంచి వేయబడ్డారు మరియు నరకాగ్నిలోకి త్రోయ బడ్డారు, ఇక వారు అల్లాహ్ తప్ప తమను కాపాడే వారినెవ్వరినీ పొందలేక పోయారు.

مِمَّا خَطِيْٓـٰٔتِهِمْ اُغْرِقُوْا فَاُدْخِلُوْا
نَارًا ۙ فَلَمْ يَجِدُوْا لَهُمْ مِّنْ دُوْنِ
اللّٰهِ اَنْصَارًا ﴿٢٥﴾

**26.** మరియు నూ'హ్ ఇలా ప్రార్థించాడు: "ఓ నా ప్రభూ! సత్య-తిరస్కారులలో ఒక్కరిని కూడా భూమి మీద వదలకు. [8]

وَقَالَ نُوْحٌ رَّبِّ لَا تَذَرْ عَلَى
الْاَرْضِ مِنَ الْكٰفِرِيْنَ دَيَّارًا ﴿٢٦﴾

**27.** "ఒకవేళ నీవు వారిని వదలిపెడితే, నిశ్చయంగా, వారు నీ దాసులను మార్గభ్రష్టత్వంలో పడవేస్తారు. మరియు వారు పాపులకు మరియు కృతఘ్నులకు మాత్రమే జన్మమిస్తారు.

اِنَّكَ اِنْ تَذَرْهُمْ يُضِلُّوْا عِبَادَكَ
وَلَا يَلِدُوْٓا اِلَّا فَاجِرًا كَفَّارًا ﴿٢٧﴾

**28.** "ఓ నా ప్రభూ! నన్నూ, నా తల్లి-దండ్రులను మరియు విశ్వాసిగా నా ఇంటి లోనికి ప్రవేశించేవానిని మరియు విశ్వాసులైన పురుషులను మరియు విశ్వాసులైన స్త్రీలను, అందరినీ క్షమించు. మరియు దుర్మార్గులకు వినాశం తప్ప మరేమీ అధికం చేయకు!" (**1/2**)

رَبِّ اغْفِرْ لِيْ وَلِوَالِدَيَّ وَلِمَنْ
دَخَلَ بَيْتِيَ مُؤْمِنًا وَّلِلْمُؤْمِنِيْنَ
وَالْمُؤْمِنٰتِ ۗ وَلَا تَزِدِ الظّٰلِمِيْنَ اِلَّا
تَبَارًا ﴿٢٨﴾

*****

8) చూడండి, 11:36.

***

## 72. సూరహ్ అల్-జిన్న్

سُوْرَةُ الْجِنِّ

ఈ *సూరహ్* చివరి **మక్కహ్** కాలంలో అవతరింపజేయబడింది. దాదాపు ప్రస్థానం (*హిజ్రత్*)కు **2** సంవత్సరాలకు ముందు. మక్కహ్ వారు తిరస్కరించినందుకు దైవప్రవక్త ('స'అ.స.) ధర్మప్రచారం చేయటానికి 'తాయఫ్‌కు వెళ్ళారు. కాని 'తాయఫ్ వాసులు అతనిని ('స'అ.స.) అవమానిస్తారు. అప్పుడు దైవప్రవక్త ('స'అ.స.) అల్లాహ్ (సు.త.)ను ప్రార్థిస్తారు. దాదాపు **2** నెలల తరువాత *యస్'రిబ్* (మదీనహ్) నుండి కొందరు వచ్చి *ఇస్లాం* స్వీకరిస్తారు. వారు దైనప్రవక్త ('స'అ.స.)ను మదీనహ్ కు రమ్మని ఆహ్వానిస్తారు. **28** *ఆయాతులున్న* ఈ *సూరహ్* పేరు **మొదటి** *ఆయత్* నుండి తీసుకోబడింది.

**అనంత కరుణామయుడు అపార కరుణాప్రదాత అయిన అల్లాహ్ పేరుతో**

بِسۡمِ اللّٰهِ الرَّحۡمٰنِ الرَّحِيۡمِ ○

**1.** * (ఓ ప్రవక్తా!) ఇలా అను: "నాకు ఈ విధంగా దివ్య సందేశం పంపబడింది; నిశ్చయంగా ఒక **జిన్నాతుల** సమూహం [1] – దీనిని (ఈ ఖుర్ ఆన్‌ను) విని – తమ జాతి వారితో ఇలా అన్నారు: 'వాస్తవానికి మేము ఒక అద్భుతమైన పఠనం (ఖుర్ఆన్) విన్నాము!

قُلۡ اُوۡحِىَ اِلَىَّ اَنَّهُ اسۡتَمَعَ نَفَرٌ مِّنَ الۡجِنِّ فَقَالُوۡۤا اِنَّا سَمِعۡنَا قُرۡاٰنًا عَجَبًا ۙ‏ ①

**2.** " 'అది సరైన మార్గం వైపునకు మార్గదర్శకత్వం చేస్తుంది. కావున మేము దానిని విశ్వసించాము. [2] మరియు మేము మా ప్రభువుకు ఎవ్వడిని కూడా భాగస్వామిగా సాటి కల్పించము.

يَّهۡدِىۡۤ اِلَى الرُّشۡدِ فَاٰمَنَّا بِهٖ ؕ وَلَنۡ نُّشۡرِكَ بِرَبِّنَاۤ اَحَدًا ۙ‏ ②

---

1) **నఫరున్:** అంటే 3 నుండి 10 వరకు ఉండే సంఖ్యల సమూహం. **నఖ్లా** లోయలో దైవప్రవక్త ('స'అ.స.) తమ అనుచరు (ర'ది.'అన్హుమ్)లతో సహా *ఫజ్ర్ నమా'జ్* చేస్తుండగా అక్కడి నుండి కొందరు జిన్నాతులు పోతూ వారి ఖుర్ఆన్ విని ప్రభావితులయి విశ్వసిస్తారు. ఈ విషయం **46:29**లో వచ్చింది. జిన్నాతులు ఖుర్ఆన్ విన్నది దైవప్రవక్త ('స'అ.స.)కు తెలియదు. అది *వ'హీ* ద్వారా తెలుపబడిందని ఇక్కడ పేర్కొనబడింది.

2) ఖుర్ఆన్‌ను వినగానే జిన్నాతులు విశ్వసించారు. కాని మానవులు మాత్రం దానిని మళ్ళీ మళ్ళీ విని కూడా విశ్వసించడం లేదు.

وَّاَنَّهٗ تَعٰلٰى جَدُّ رَبِّنَا مَا اتَّخَذَ صَاحِبَةً وَّلَا وَلَدًا ③

3. " 'మరియు నిశ్చయంగా, మా ప్రభువు వైభవం ఎంతో ఉన్నతమైనది. ఆయన ఎవ్వరినీ భార్య (సాహిబతున్) గా గానీ, కుమారునిగా గానీ చేసుకోలేదు.

وَّاَنَّهٗ كَانَ يَقُوْلُ سَفِيْهُنَا عَلَى اللّٰهِ شَطَطًا ④

4. " 'మరియు నిశ్చయంగా మనలోని అవివేకులు, కొందరు అల్లాహ్ విషయంలో దారుణమైన మాటలు పలుకుతున్నారు.

وَّاَنَّا ظَنَنَّآ اَنْ لَّنْ تَقُوْلَ الْاِنْسُ وَالْجِنُّ عَلَى اللّٰهِ كَذِبًا ⑤

5. " 'మరియు వాస్తవానికి, మనం మానవులు గానీ, జిన్నాతులు గానీ అల్లాహ్‌ను గురించి అబద్ధం పలకరని భావించే వారము.

وَّاَنَّهٗ كَانَ رِجَالٌ مِّنَ الْاِنْسِ يَعُوْذُوْنَ بِرِجَالٍ مِّنَ الْجِنِّ فَزَادُوْهُمْ رَهَقًا ⑥

6. " 'మరియు వాస్తవానికి, మానవులలో నుండి కొందరు పురుషులు, జిన్నాతులలో నుండి కొందరు పురుషుల శరణు వేడుతూ ఉండేవారు. ఈ విధంగా వారు, వారి (జిన్నాతుల) తలబిరుసుతనం మరింత అధికమే చేశారు. [3]

وَّاَنَّهُمْ ظَنُّوْا كَمَا ظَنَنْتُمْ اَنْ لَّنْ يَّبْعَثَ اللّٰهُ اَحَدًا ⑦

7. " 'మరియు వాస్తవానికి, వారు (మానవులు) కూడా మీరు (జిన్నాతులు) భావించినట్లు, అల్లాహ్ ఎవ్వడినీ కూడా సందేశహరునిగా పంపడని భావించారు.

وَّاَنَّا لَمَسْنَا السَّمَآءَ فَوَجَدْنٰهَا مُلِئَتْ حَرَسًا شَدِيْدًا وَّشُهُبًا ⑧

8. " 'మరియు నిశ్చయంగా, మేము ఆకాశాలలో (రహస్యాలను) తొంగిచూడటానికి ప్రయత్నించినపుడు మేము దానిని కఠినమైన కావలి వారితో మరియు అగ్ని జ్వాలలతో నిండి ఉండటాన్ని చూశాము. [4]

---

3) చివరి వాక్యానికి కొందరు వ్యాఖ్యాతలు ఈ విధంముగా తాత్పర్యం చెప్పారు: *'కాని వారు, వారి (మానవుల) పాపాన్ని, అవిశ్వాసాన్ని మరింత అధికం చేశారు.'* ఇస్లాంకు ముందు అరబ్బులు తమ ప్రయాణాలలో ఎక్కడైనా ఆగితే, అక్కడి **జిన్నాతులతో శరణు కోరేవారు**. ఇస్లాం దీనిని నిషేధించింది. మరియు కేవలం ఒకే ఒక్క ప్రభువు, అల్లాహ్ (సు.త.)తో శరణు కోరటాన్ని మాత్రమే విధిగా చేసింది.

4) చూడండి, 15:17-18 ఆకాశాలలో దైవదూత ('అలైహిమ్.స.)లు, ఇతరులు అక్కడి మాటలు వినకుండా కాపలా కాస్తూ ఉంటారు. మరియు ఈ అగ్ని కణాలు (షుహుబున్,

**9.** " 'మరియు వాస్తవానికి పూర్వం అక్కడి మాటలు వినటానికి మేము రహస్యంగా అక్కడ కూర్చునే వారం. [5] కాని ఇప్పుడు ఎవడైనా (రహస్యంగా) వినే ప్రయత్నం చేస్తే, అతడి కొరకు అక్కడ ఒక అగ్నిజ్వాల పొంచి ఉంటుంది. [6]

وَّاَنَّا كُنَّا نَقْعُدُ مِنْهَا مَقَاعِدَ لِلسَّمْعِ ؕ فَمَنْ يَّسْتَمِعِ الْاٰنَ يَجِدْ لَهٗ شِهَابًا رَّصَدًا ⑨

**10.** "'మరియు వాస్తవానికి, భూమిలో ఉన్న వారికి ఏదైనా కీడు ఉద్దేశింపబడిందా, లేక వారి ప్రభువు, వారికి సరైనమార్గం చూపగోరు తున్నాడా అనే విషయం, మాకు తెలియదు.

وَّاَنَّا لَا نَدْرِيْٓ اَشَرٌّ اُرِيْدَ بِمَنْ فِي الْاَرْضِ اَمْ اَرَادَ بِهِمْ رَبُّهُمْ رَشَدًا ⑩

**11.** " 'మరియు వాస్తవానికి, మనలో కొందరు సద్వర్తనులున్నారు, మరికొందరు దానికి విరుద్ధంగా ఉన్నారు. వాస్తవానికి మనం విభిన్నమార్గాలను అనుసరిస్తూ వచ్చాము. [7]

وَّاَنَّا مِنَّا الصّٰلِحُوْنَ وَمِنَّا دُوْنَ ذٰلِكَ ؕ كُنَّا طَرَآئِقَ قِدَدًا ⑪

**12.** " 'మరియు నిశ్చయంగా మేము అల్లాహ్ నుండి భూలోకంలో తప్పించు కోలేము, అని అర్థం చేసుకున్నాము. మరియు పారిపోయి కూడా ఆయన నుండి తప్పించుకోలేము.

وَّاَنَّا ظَنَنَّآ اَنْ لَّنْ نُّعْجِزَ اللّٰهَ فِي الْاَرْضِ وَلَنْ نُّعْجِزَهٗ هَرَبًا ⑫

**13.** " 'మరియు నిశ్చయంగా, మేము ఈ మార్గదర్శకత్వాన్ని (ఖుర్ఆన్‌ను) విన్న ప్పుడు దానిని విశ్వసించాము. కావున ఎవడైతే తన ప్రభువును విశ్వసిస్తాడో అతడికి తన సత్కర్మల ఫలితంలో నష్టాన్ని గురించి మరియు శిక్షలో హెచ్చింపును గురించి భయపడే అవసరం ఉండదు.

وَّاَنَّا لَمَّا سَمِعْنَا الْهُدٰٓى اٰمَنَّا بِهٖ ؕ فَمَنْ يُّؤْمِنْ بِرَبِّهٖ فَلَا يَخَافُ بَخْسًا وَّلَا رَهَقًا ⑬

---

షిహాబున్ యొక్క బ.వ.), ఆకాశాలలోని మాటలు వినటానికి పైకిపోయే జిన్నాతులపై పడతాయి.

5) మేము (జిన్నాతులము) ఆకాశాల మాటలు విని జ్యోతిష్యులకు చెప్పేవారము. వాటిలో వారు తమ వైపు నుండి నూరు అబద్ధాలు కలిపి చెప్పేవారు.

6) కాని దైవప్రవక్త ('స'అ.స.) వచ్చిన తరువాత నుండి ఈ పని ఆపబడింది. ఇప్పుడు ఎవడైనా పైకి పోవటానికి ప్రయత్నిస్తే అగ్నికణం అతనిపై పడుతుంది.

7) జిన్నాతులలో కూడా వేర్వేరు జాతులవారు, యూదులు, క్రైస్తవులు, ముస్లింలు మరియు సత్య-తిరస్కారులు మొదలైనవారు ఉన్నారు.

وَّاَنَّا مِنَّا الْمُسْلِمُوْنَ وَمِنَّا الْقٰسِطُوْنَ ؕ فَمَنْ اَسْلَمَ فَاُولٰٓىِٕكَ تَحَرَّوْا رَشَدًا ⑭

**14.** " 'మరియు నిశ్చయంగా మనలో కొందరు ముస్లింలు (అల్లాహ్‌కు విధేయులైన వారు) ఉన్నారు. మరికొందరు నిశ్చయంగా, అన్యాయపరులు [8] (సత్యానికి దూరమైన వారు) ఉన్నారు. కావున ఎవరైతే ఇస్లాంను అవలంబించారో, అలాంటి వారే సరైన మార్గాన్ని కనుగొన్న వారు!' "

وَاَمَّا الْقٰسِطُوْنَ فَكَانُوْا لِجَهَنَّمَ حَطَبًا ⑮

**15.** మరియు అన్యాయపరులే (సత్యానికి దూరమైన వారే) నరకానికి ఇంధనమయ్యే వారు! [9]

وَّاَنْ لَّوِ اسْتَقَامُوْا عَلَى الطَّرِيْقَةِ لَاَسْقَيْنٰهُمْ مَّآءً غَدَقًا ⑯

**16.** ఒకవేళ వారు రుజుమార్గం మీద స్థిరంగా ఉన్నట్లైతే, మేము వారిపై పుష్కలంగా నీటిని కురిపించేవారము –

لِّنَفْتِنَهُمْ فِيْهِ ؕ وَمَنْ يُّعْرِضْ عَنْ ذِكْرِ رَبِّهٖ يَسْلُكْهُ عَذَابًا صَعَدًا ⑰

**17.** దానితో వారిని పరీక్షించటానికి – మరియు ఎవడైతే తన ప్రభువు ధ్యానం నుండి విముఖుడవుతాడో, ఆయన వాడిని తీవ్రమైన శిక్షకు గురిచేస్తాడు.

وَّاَنَّ الْمَسٰجِدَ لِلّٰهِ فَلَا تَدْعُوْا مَعَ اللّٰهِ اَحَدًا ⑱

**18.** మరియు నిశ్చయంగా, మస్జిదులు అల్లాహ్ కొరకే ప్రత్యేకించబడ్డాయి. కావున వాటిలో అల్లాహ్ తో బాటు ఇతరు లెవ్వరినీ ప్రార్థించకండి.

وَّاَنَّهٗ لَمَّا قَامَ عَبْدُ اللّٰهِ يَدْعُوْهُ كَادُوْا يَكُوْنُوْنَ عَلَيْهِ لِبَدًا ⑲

**19.** మరియు నిశ్చయంగా, అల్లాహ్ యొక్క దాసుడు (ము'హమ్మద్) ఆయన (అల్లాహ్)ను ప్రార్థించటానికి నిలబడినప్పుడు, వారు (జిన్నాతులు) అతని చుట్టు దట్టంగా (అతని ఖుర్ఆన్ పఠనాన్ని వినటానికి) గుమి

---

8) ఖాసితూన్: ఈ పదానికి – సందర్భాన్ని బట్టి – న్యాయవర్తనులు, అన్యాయపరులు అనే **రెండు అర్థాలు వస్తాయి**. ఈ సందర్భంలో అన్యాయపరులు, లేక సన్మార్గం నుండి లేక సత్యం నుండి విముఖులైనవారు అనే అర్థంలో వాడబడింది.

9) అంటే జిన్నాతులలో కూడా నరకం మరియు స్వర్గంలోకి పోయేవారున్నారు. సత్య-తిరస్కారులు నరకంలోకి మరియు విశ్వాసులు స్వర్గంలోకి పోతారు.

గూడుతారు. [10]

**20.** వారితో ఇలా అను: "నిశ్చయంగా నేను, నా ప్రభువును మాత్రమే ప్రార్థిస్తాను మరియు ఆయనకు ఎవ్వరినీ సాటి కల్పించను." [11]

قُلۡ اِنَّمَاۤ اَدۡعُوۡا رَبِّىۡ وَلَاۤ اُشۡرِكُ بِهٖۤ اَحَدًا ⑳

**21.** వారితో ఇలా అను: "నిశ్చయంగా, మీకు కీడు చేయటం గానీ, లేదా సరైన మార్గం చూపటం గానీ నావశంలో లేదు."

قُلۡ اِنِّىۡ لَاۤ اَمۡلِكُ لَـكُمۡ ضَرًّا وَّلَا رَشَدًا ㉑

**22.** ఇంకా ఇలా అను: "నిశ్చయంగా, నన్ను అల్లాహ్ నుండి ఎవ్వడునూ కాపాడలేడు మరియు నాకు ఆయనతప్ప మరొకరి ఆశ్రయం కూడాలేదు;

قُلۡ اِنِّىۡ لَنۡ يُّجِيۡرَنِىۡ مِنَ اللّٰهِ اَحَدٌ ۙ وَّلَنۡ اَجِدَ مِنۡ دُوۡنِهٖ مُلۡتَحَدًا ۙ ㉒

**23.** "(నా పని) కేవలం అల్లాహ్ ఉపదేశాన్ని మరియు ఆయన సందేశాన్ని అందజేయ టమే!" ఇక ఎవడైతే అల్లాహ్ మరియు ఆయన ప్రవక్త ఆజ్ఞను ఉల్లంఘిస్తాడో! అతడు నిశ్చయంగా, నరకాగ్నికి గురి అవుతాడు; అందులో శాశ్వతంగా కలకాలం ఉంటాడు.

اِلَّا بَلٰغًا مِّنَ اللّٰهِ وَرِسٰلٰتِهٖ ؕ وَمَنۡ يَّعۡصِ اللّٰهَ وَرَسُوۡلَهٗ فَاِنَّ لَهٗ نَارَ جَهَنَّمَ خٰلِدِيۡنَ فِيۡهَاۤ اَبَدًا ؕ ㉓

**24.** చివరకు వారికి వాగ్దానం చేయబడిన దానిని వారు చూసినప్పుడు, ఎవరి సహాయ కులు బలహీనులో, మరెవరి వర్గం సంఖ్యాపరంగా తక్కువో వారికి తెలిసిపోతుంది. [12]

حَتّٰۤى اِذَا رَاَوۡا مَا يُوۡعَدُوۡنَ فَسَيَعۡلَمُوۡنَ مَنۡ اَضۡعَفُ نَاصِرًا وَّاَقَلُّ عَدَدًا ㉔

---

10) పైన పేర్కొన్న తాత్పర్యం నొబుల్ ఖుర్ఆన్ ను అనుసరించి ఉన్నది. దీని మరొక తాత్పర్యంలో: *"(మానవులు మరియు జిన్నులు) అల్లాహ్ (సు.త.) దాసుడు (ము'హమ్మద్ 'స'అ.స. అల్లాహుతఆలాను) ప్రార్థించటానికి నిలబడినపుడు అతని చుట్టు దట్టంగా గుమిగూడి అల్లాహుతఆలా జ్యోతిని తమ నోట్లతో ఊది ఆర్పివేయ గోరుతారు."* అని ఉంది. ఈ తాత్పర్యం ఇబ్నె-'అబ్బాస్, ముజాహిద్, స'ఈద్ బిన్-'జుబైర్ మరియు ఇబ్నె-'జైద్ (ర'ది. 'అన్హుమ్)లు ఇచ్చారు. ఇబ్నె-జరీర్ (ర'హ్మ) దీనికి ప్రాధాన్యతనిచ్చారు. ఇది ఇబ్నె-కసీ'ర్ (ర'హ్మ)లో పేర్కొనబడింది..

11) అలాంటప్పుడు వారితో ఇలా అను: 'నేను నా ప్రభువు (సు.త.)ను మాత్రమే ప్రార్థిస్తాను. మరియు ఆయన (సు.త.)కు ఎవ్వరినీ సాటి కల్పించను.'

12) ఇటువంటి ఆయత్ కోసం చూడండి, 19:75.

**25.** ఇలా అను: "మీకు వాగ్దానం చేయబడి నది (శిక్ష) సమీపంలోనే రానున్నదో, లేక దాని కొరకు నా ప్రభువు దీర్ఘకాల వ్యవధి నియమిం చాడో నాకు తెలియదు."

قُلْ اِنْ اَدْرِيْٓ اَقَرِيْبٌ مَّا تُوْعَدُوْنَ اَمْ يَجْعَلُ لَهٗ رَبِّيْٓ اَمَدًا ﴿25﴾

**26.** ఆయనే అగోచర జ్ఞానం గలవాడు, కావున ఆయన అగోచర విషయాలు ఎవ్వడికీ తెలియజేయడు –

عٰلِمُ الْغَيْبِ فَلَا يُظْهِرُ عَلٰى غَيْبِهٖٓ اَحَدًا ﴿26﴾

**27.** తాను కోరి ఎన్నుకొన్న ప్రవక్తకు తప్ప[13] – ఎందుకంటే, ఆయన నిశ్చయంగా, అతని (ఆ ప్రవక్త) ముందు మరియు వెనుక రక్షక భటులను నియమిస్తాడు.

اِلَّا مَنِ ارْتَضٰى مِنْ رَّسُوْلٍ فَاِنَّهٗ يَسْلُكُ مِنْۢ بَيْنِ يَدَيْهِ وَمِنْ خَلْفِهٖ رَصَدًا ﴿27﴾

**28.** వారు, (ప్రవక్తలు) తమ ప్రభువు యొక్క సందేశాలను యథాతథంగా అంద జేస్తున్నారని పరిశీలించటానికి. [14] మరియు ఆయన వారి అన్ని విషయాలను పరివేష్టించి ఉన్నాడు. మరియు ఆయన ప్రతి ఒక్క విషయాన్ని లెక్కపెట్టి ఉంచుతాడు.

لِّيَعْلَمَ اَنْ قَدْ اَبْلَغُوْا رِسٰلٰتِ رَبِّهِمْ وَاَحَاطَ بِمَا لَدَيْهِمْ وَاَحْصٰى كُلَّ شَيْءٍ عَدَدًا ﴿28﴾

*****

13) చూడండి, 3:179.

14) ఈ తాత్పర్యం నోబుల్ ఖుర్ఆన్‌ను అనుసరించి ఉంది. దీని ఇతర తాత్పర్యాలకు చూడండి, ఇబ్నె-కసీ'ర్ వగైరా. ***

## 73. సూరహ్ అల్-ము'జ్జమ్మిల్

سُورَةُ المُزَّمِّلِ

*అల్-ము'జ్జమ్మిల్:* The Enwrapped **దుప్పటి కప్పుకున్నవాడు.** ఈ సూరహ్ అవతరణా క్రమంలో **4** వది. మొదటి **మక్కహ్** కాలానికి చెందినది. **20** ఆయాతులున్న ఈ సూరహ్ పేరు **మొదటి** ఆయత్ నుండి తీసుకోబడింది.

بِسْمِ اللّٰهِ الرَّحْمٰنِ الرَّحِيْمِ ○

**అనంత కరుణామయుడు అపార కరుణాప్రదాత అయిన అల్లాహ్ పేరుతో**

يٰٓاَيُّهَا الْمُزَّمِّلُ ①

**1.** ఓ **దుప్పటి కప్పుకున్నవాడా!** [1]

قُمِ الَّيْلَ اِلَّا قَلِيْلًا ②

**2.** రాత్రంతా (*నమా'జ్‌లో*) నిలబడు, కొంత భాగాన్ని విడిచి;

نِّصْفَهٗٓ اَوِ انْقُصْ مِنْهُ قَلِيْلًا ③

**3.** దాని సగ భాగంలో, లేదా దానికంటే కొంత తక్కువ;

اَوْ زِدْ عَلَيْهِ وَرَتِّلِ الْقُرْاٰنَ تَرْتِيْلًا ④

**4.** లేదా దాని కంటే కొంత ఎక్కువ; మరియు ఖుర్ఆన్‌ను ఆగి ఆగి నెమ్మదిగా స్పష్టంగా పఠించు.

اِنَّا سَنُلْقِيْ عَلَيْكَ قَوْلًا ثَقِيْلًا ⑤

**5.** నిశ్చయంగా, మేము నీపై భారమైన సందేశాన్ని అవతరింపజేయబోతున్నాము.

اِنَّ نَاشِئَةَ الَّيْلِ هِيَ اَشَدُّ وَطْاً وَّاَقْوَمُ قِيْلًا ⑥

**6.** నిశ్చయంగా, రాత్రివేళ లేవటం (మనస్సును) అదుపులో ఉంచుకోవటానికి ఎంతో ఉపయుక్తమైనది మరియు (అల్లాహ్) ప్రవచనాలను (అర్థం చేసుకోవటానికి) కూడా ఎంతో అనుగుణమైనది.

اِنَّ لَكَ فِى النَّهَارِ سَبْحًا طَوِيْلًا ⑦

**7.** వాస్తవానికి, పగటి వేళ నీకు చాలా పనులుంటాయి.

---

1) ఈ *సూరహ్* అవతరింపజేయబడినప్పుడు దైవప్రవక్త ('స'అ.స.) దుప్పటి కప్పుకొని పడుకొని ఉంటారు. అతనికి ('స'అ.స.కు) లేచి *తహజ్జుద్ నమా'జ్* చేయమని ఆజ్ఞ ఇవ్వబడింది. *తహజ్జుద్* అతని ('స'అ.స.) కొరకు తప్పనిసరి (*వాజిబ్*) చేయబడి ఉండెను. (ఇబ్నె-కసీ'ర్).

**8.** మరియు నీవు నీ ప్రభువు నామాన్ని స్మరిస్తూ ఉండు. మరియు అత్యంత శ్రద్ధా భక్తులతో ఆయన వైపునకే మరలుతూ ఉండు (మనస్సును లగ్నం చేయి).

وَاذْكُرِ اسْمَ رَبِّكَ وَتَبَتَّلْ اِلَيْهِ
تَبْتِيْلًا ⑧

**9.** ఆయనే తూర్పూ పడమరలకు ప్రభువు, ఆయన తప్ప మరొక ఆరాధ్య దైవం లేడు, కావున నీవు ఆయననే కార్య సాధకునిగా చేసుకో.

رَبُّ الْمَشْرِقِ وَالْمَغْرِبِ لَآ اِلٰهَ اِلَّا
هُوَ فَاتَّخِذْهُ وَكِيْلًا ⑨

**10.** మరియు వారు పలికే మాటలకు సహనం వహించు మరియు మంచితనంతో వారి నుండి తొలగిపో.

وَاصْبِرْ عَلٰى مَا يَقُوْلُوْنَ وَاهْجُرْهُمْ
هَجْرًا جَمِيْلًا ⑩

**11.** మరియు అసత్యవాదులైన ఈ సంపన్నులను, నాకు వదలిపెట్టు. [2] మరియు వారికి కొంత వ్యవధి నివ్వు.

وَذَرْنِيْ وَالْمُكَذِّبِيْنَ اُولِي النَّعْمَةِ
وَمَهِّلْهُمْ قَلِيْلًا ⑪

**12.** నిశ్చయంగా, మా వద్ద వారి కొరకు సంకెళ్ళు మరియు భగభగ మండే నరకాగ్ని ఉన్నాయి.

اِنَّ لَدَيْنَآ اَنْكَالًا وَّجَحِيْمًا ⑫

**13.** మరియు గొంతులో ఇరుక్కుపోయే ఆహారం మరియు బాధాకరమైన శిక్ష (ఉన్నాయి).

وَّطَعَامًا ذَا غُصَّةٍ وَّعَذَابًا اَلِيْمًا ⑬

**14.** ఆ రోజు భూమి మరియు పర్వతాలు కంపించి పోతాయి. మరియు పర్వతాలు ప్రవహించే ఇసుక దిబ్బలుగా మారిపోతాయి. [3]

يَوْمَ تَرْجُفُ الْاَرْضُ وَالْجِبَالُ
وَكَانَتِ الْجِبَالُ كَثِيْبًا مَّهِيْلًا ⑭

**15.** మేము ఫిర్'ఔన్ వద్దకు సందేశహరుణ్ణి పంపినట్లు, నిశ్చయంగా, మీ వద్దకు కూడా ఒక సందేశహరుణ్ణి, మీకుసాక్షిగా ఉండటానికి పంపాము.

اِنَّآ اَرْسَلْنَآ اِلَيْكُمْ رَسُوْلًا ەۙ
شَاهِدًا عَلَيْكُمْ كَمَآ اَرْسَلْنَآ اِلٰى
فِرْعَوْنَ رَسُوْلًا ⑮

---

2) చూడండి,74:11.
3) చూడండి,14:48 మరియు 20:105 -107.

**16.** కాని ఫిర్'ఔన్ ఆ సందేశహరునికి అవిధేయత చూపాడు. కావున మేము అతనిని కఠినంగా పట్టుకున్నాము.

فَعَصٰى فِرْعَوْنُ الرَّسُوْلَ فَاَخَذْنٰهُ اَخْذًا وَّبِيْلًا ⑯

**17.** ఒకవేళ మీరు సత్యాన్ని తిరస్కరిస్తే, బాలురను ముసలివారిగా చేసేటటువంటి ఆ దినపు శిక్ష నుండి ఎలా తప్పించుకోగలరు? [4]

فَكَيْفَ تَتَّقُوْنَ اِنْ كَفَرْتُمْ يَوْمًا يَّجْعَلُ الْوِلْدَانَ شِيْبًا ۖ ⑰

**18.** అప్పుడు ఆకాశం బ్రద్దలైపోతుంది. ఆయన యొక్క వాగ్దానం తప్పక నెరవేరి తీరుతుంది.

اِۨالسَّمَآءُ مُنْفَطِرٌۢ بِهٖ ۭ كَانَ وَعْدُهٗ مَفْعُوْلًا ⑱

**19.** నిశ్చయంగా, ఇదొక హితోపదేశం కాబట్టి కోరినవారు తన ప్రభువు వైపుకు తీసుకు పోయే మార్గాన్ని అవలంబించవచ్చు! (5/8)

اِنَّ هٰذِهٖ تَذْكِرَةٌ ۚ فَمَنْ شَآءَ اتَّخَذَ اِلٰى رَبِّهٖ سَبِيْلًا ۧ ⑲

**20.** * (ఓ ము'హమ్మద్!) నీవు, వాస్తవానికి దాదాపు మూడింట రెండువంతుల రాత్రి లేక సగం (రాత్రి) లేక మూడింట ఒక భాగం (*నమా'జ్‌లో*) నిలుస్తావనేది నీ ప్రభువుకు బాగా తెలుసు. మరియు నీతోపాటు ఉన్న వారిలో కొందరు కూడా! మరియు అల్లాహ్ రేయింబవళ్ళ పరిమాణాలను నిర్ణయిస్తాడు. మీరు ఖచ్చితంగా పూర్తి రాత్రి ప్రార్థించలేరని ఆయనకు తెలుసు. కావున ఆయన మీ వైపునకు (కనికరంతో) మరలాడు. కావున

اِنَّ رَبَّكَ يَعْلَمُ اَنَّكَ تَقُوْمُ اَدْنٰى مِنْ ثُلُثَيِ الَّيْلِ وَنِصْفَهٗ وَثُلُثَهٗ وَطَآئِفَةٌ مِّنَ الَّذِيْنَ مَعَكَ ۭ وَاللّٰهُ يُقَدِّرُ الَّيْلَ وَالنَّهَارَ ۭ عَلِمَ اَنْ لَّنْ تُحْصُوْهُ فَتَابَ عَلَيْكُمْ فَاقْرَءُوْا مَا تَيَسَّرَ مِنَ الْقُرْاٰنِ ۭ عَلِمَ اَنْ سَيَكُوْنُ مِنْكُمْ مَّرْضٰى ۙ وَاٰخَرُوْنَ يَضْرِبُوْنَ فِي الْاَرْضِ

---

4) పునరుత్థాన దినమున ఆదమ్ ('అ.స.)తో ఇలా అనబడుతుంది: "నీ సంతానం నుండి నరకం వారిని ఎన్నుకో." అతను ప్రశ్నిస్తారు: "ఓ అల్లాహ్ (సు.త.)! ఏ విధంగా?" అల్లాహ్ (సు.త.) అంటాడు: "ప్రతి వేయిమంది నుండి 999 మందిని, అప్పుడు గర్భవతులైన స్త్రీల పిండాలు పడిపోతాయి మరియు పిల్లలు వృద్ధులైపోతారు." ఈవిషయం విని అనుచరు (ర'ది. 'అన్హుమ్)లు చాలా చింతలో పడిపోతారు. అప్పుడు దైవప్రవక్త ('స'అ.స.) అంటారు: "*యా'జూజ్ మా'జూజ్* ల జాతివారి నుండి 999 ఉంటారు. మరియు మీలో నుండి ఒకడు; అల్లాహ్ (సు.త.) కరుణపై నాకు విశ్వాసముంది. స్వర్గవాసులలోనుండి సగం మంది మీరుంటారు."('స.బు'ఖారీ).

يَبْتَغُوْنَ مِنْ فَضْلِ اللّٰهِ ۙ وَاٰخَرُوْنَ يُقَاتِلُوْنَ فِيْ سَبِيْلِ اللّٰهِ ۖ فَاقْرَءُوْا مَا تَيَسَّرَ مِنْهُ ۙ وَاَقِيْمُوا الصَّلٰوةَ وَاٰتُوا الزَّكٰوةَ وَاَقْرِضُوا اللّٰهَ قَرْضًا حَسَنًا ؕ وَمَا تُقَدِّمُوْا لِاَنْفُسِكُمْ مِّنْ خَيْرٍ تَجِدُوْهُ عِنْدَ اللّٰهِ هُوَ خَيْرًا وَّاَعْظَمَ اَجْرًا ؕ وَاسْتَغْفِرُوا اللّٰهَ ؕ اِنَّ اللّٰهَ غَفُوْرٌ رَّحِيْمٌ ⑳

ఖుర్ఆన్‌ను, మీరు సులభంగా పఠించగలిగినంతే పఠించండి. మీలో కొందరు వ్యాధిగ్రస్తులు కావచ్చు, మరికొందరు అల్లాహ్ అనుగ్రహాన్ని (ఉపాధిని) అన్వేషిస్తూ భూమిలో ప్రయాణంలో ఉండవచ్చు, మరికొందరు అల్లాహ్ మార్గంలో పోరాడుతూ ఉండవచ్చు, అని ఆయనకు బాగా తెలుసు. కావున మీరు దానిలో సులువుగా పఠించ గలిగినంత దానినే పఠించండి. [5] మరియు *నమా'జ్‌ను* స్థాపించండి, [6] విధిదానం (*'జకాత్*) ఇవ్వండి. మరియు అల్లాహ్‌కు మంచి అప్పును, అప్పుగా ఇస్తూ ఉండండి. మరియు మీరు, మీ కొరకు ఏ మంచి కార్యాన్ని చేసి పంపినా దాన్ని అల్లాహ్ దగ్గర అత్యుత్తమ పుణ్యఫలం రూపంలో అత్యధికంగా పొందుతారు. మరియు మీరు అల్లాహ్‌ను క్షమాభిక్ష అర్థిస్తూ ఉండండి. నిశ్చయంగా, అల్లాహ్ క్షమాశీలుడు, అపార కరుణాప్రదాత.

*****

5) అల్లాహ్ (సు.త.) మిమ్మల్ని కనికరించాడు కావున, *తహజ్జుద్‌లో* మీకు సులభమైనంతనే పఠించండి. **రెండు** *రకాతులైనా* సరే. దైవప్రవక్త ('స'అ.స.) చాలా మట్టుకు **ఎనిమిది** *రకాతులు* చేసేవారు. అతనినే ('స'అ.స.) అనుసరించినా ఎంతో మేలు. మీ *తహజ్జుద్ నమా'జ్‌లో* వీలైనంత ఖుర్ఆన్ పఠనం చేయండి. నెమ్మదిగా స్పష్టంగా పఠించండి.

6) అంటే ఐదుసార్లు చేసే *ఫ'ర్ద్ నమా'జ్‌లు*. చాలామంది వ్యాఖ్యాతల అభిప్రాయంలో ఈ *ఆయత్* మదీనహ్ లో అవతరింపజేయబడింది. ***

## 74. సూరహ్ అల్-ముద్దస్సి'ర్

سُورَةُ المُدَّثِّر

*అల్-ముద్దస్సి'ర్:* The Enfolded One, **బట్ట (దుప్పటి)లో చుట్టుకున్నవాడు!** దైవప్రవక్త ము'హమ్మద్ ('స'అ.స.)పై *సూరహ్ అల్-ఇఖ్రా'* **(96:1-5)** మొదటి అయిదు *ఆయాతులు* అవతరించిన తరువాత కొంతకాలం **(6** నెలల నుండి **3** సంవత్సరాల) వరకు ఏ *వ'హీ* అవత రింపజేయబడలేదు. ఈ కాలాన్ని, **ఫతరతుల్ వ'హీ** అంటారు. అప్పుడు దైవప్రవక్త ('స'అ.స.) ఎంతో కలవరపడ్డారు. అప్పుడు అతని ('స'అ.స.) భార్య 'ఖదీజహ్ (ర.'అన్హా) అతనికి నైతిక ప్రోత్సాహాన్నిచ్చారు. ఆ తరువాత ఒక రోజు జిబ్రీల్ ('అ.స.) ఆకాశాలు మరియు భూమి మధ్య ప్రత్యక్ష మయ్యారు. ఆ తరువాత ఈ సూరహ్ అవతరిపంజేయబడింది. ఆ తరువాత *వ'హీ* త్వరత్వరగా రావడం ఆరంభమయ్యింది, ('స. బు'ఖారీ, ముస్లిం). దీని కొన్ని *ఆయాతులు* తరువాత అవతరింపజేయబడ్డాయి. ఈ *సూరహ్* **మక్కహ్** లో అవతరింపజేయబడింది.

ఈ సూరహ్ ఇస్లాం విధులను, అల్లాహ్ ఏకత్వాన్ని పునరుత్థానాన్ని మరియు అంతిమ తీర్పును వివరిస్తోంది. మానవుడు బలహీనుడని, అల్లాహ్ (సు.త.)పై అతడు ఆధారపడి ఉన్నాడని, ప్రతి మానవుడు తన కర్మలకు తానే బాధ్యుడని, అతడు వాటి ఫలితాన్ని అనుభవిస్తాడని మరియు అతడి కర్మలను బట్టి స్వర్గ-నరకాలున్నాయని బోధిస్తోంది. **56** *ఆయాతులున్న* ఈ *సూరహ్* పేరు **మొదటి** *ఆయత్* నుండి తీసుకోబడింది.

بِسۡمِ اللّٰهِ الرَّحۡمٰنِ الرَّحِيۡمِ ○

**అనంత కరుణామయుడు అపార కరుణాప్రదాత అయిన అల్లాహ్ పేరుతో**

يٰٓاَيُّهَا الۡمُدَّثِّرُ ①

**1.** ఓ **దుప్పటిలో చుట్టుకున్నవాడా!**

قُمۡ فَاَنۡذِرۡ ②

**2.** లే! ఇక హెచ్చరించు!

وَرَبَّكَ فَكَبِّرۡ ③

**3.** మరియు నీ ప్రభువు గొప్పతనాన్ని (ఘనతను) కొనియాడు (చాటి చెప్పు)!

وَثِيَابَكَ فَطَهِّرۡ ④

**4.** మరియు నీ వస్త్రాలను పరిశుభ్రంగా ఉంచుకో!

وَالرُّجۡزَ فَاهۡجُرۡ ⑤

**5.** మరియు మాలిన్యానికి దూరంగా ఉండు!

وَلَا تَمۡنُنۡ تَسۡتَكۡثِرُ ⑥

**6.** మరియు ఎక్కువ పొందాలనే ఆశతో ఇవ్వకు (ఉపకారం చేయకు)!

| | |
|---|---|
| **7.** మరియు నీ ప్రభువు కొరకు సహనం వహించు! | وَلِرَبِّكَ فَاصۡبِرۡ ⑦ |
| **8.** మరియు **బాకా** (నాఖూర్) ఊదబడి నప్పుడు; | فَاِذَا نُقِرَ فِی النَّاقُوۡرِ ⑧ |
| **9.** ఆ దినం చాలా కఠినమైన దినమై ఉంటుంది; | فَذٰلِكَ یَوۡمَىِٕذٍ یَّوۡمٌ عَسِیۡرٌ ⑨ |
| **10.** సత్య-తిరస్కారులకు అది సులభమైన (దినం) కాదు. [1] | عَلَی الۡكٰفِرِیۡنَ غَیۡرُ یَسِیۡرٍ ⑩ |
| **11.** వదలండి! నన్నూ మరియు నేను ఒంటరిగా పుట్టించిన వానినీ! [2] | ذَرۡنِیۡ وَمَنۡ خَلَقۡتُ وَحِیۡدًا ⑪ |
| **12.** మరియు నేను అతనికి పుష్కలంగా సంపదనిచ్చాను. | وَّجَعَلۡتُ لَهٗ مَالًا مَّمۡدُوۡدًا ⑫ |
| **13.** మరియు అతనికి తోడుగా ఉండే కుమారులను! | وَّبَنِیۡنَ شُهُوۡدًا ⑬ |
| **14.** మరియు అతని కొరకు అతని జీవన సౌకర్యాలను సమకూర్చాను. | وَّمَهَّدۡتُّ لَهٗ تَمۡهِیۡدًا ⑭ |
| **15.** అయినా నేను అతనికి ఇంకా ఇవ్వాలని అతడు ఆశిస్తూ ఉంటాడు. | ثُمَّ یَطۡمَعُ اَنۡ اَزِیۡدَ ⑮ |
| **16.** అలా కాదు! వాస్తవానికి అతడు మా (అల్లాహ్) సూచనల (*ఆయాత్* ల) పట్ల విరోధం కలిగివున్నాడు. | كَلَّا ؕ اِنَّهٗ كَانَ لِاٰیٰتِنَا عَنِیۡدًا ⑯ |
| **17.** నేను త్వరలోనే అతనిని ఎత్తైన స్థానానికి (శిక్షకు) నెట్టుతాను! | سَاُرۡهِقُهٗ صَعُوۡدًا ⑰ |

---

1) **అల్-కాఫిరీన్:** అంటే సత్య-తిరస్కారులు. ఈ పదం ఇక్కడ ఖుర్ఆన్ అవతరణాక్రమంలో **మొదటిసారి** వచ్చింది. 57:20లో మాత్రం ఈ పదానికి భూమిని దున్నేవాడు అనే అర్థం ఉంది. మిగతా అన్ని చోట్లలో ఈ పదం సత్య-తిరస్కారులనే అర్థంలోనే వాడబడింది.

2) చూడండి, 6:94, 19:80, 95. కొందరు వ్యాఖ్యాతలు ఈ *ఆయత్* వలీద్ బిన్ ము'గైరాను ఉద్దేశిస్తోంది అని అభిప్రాయపడ్డారు. అతడు సత్య-తిరస్కారం మరియు దురహంకారంలో మితిమీరి పోయాడు. ఈ *ఆయత్* ఇటువంటి ప్రతి సత్యతిరస్కారిని సూచిస్తుంది.

| | |
|---|---|
| **18.** వాస్తవానికి అతడు ఆలోచించాడు మరియు మనస్సులో ప్రణాళిక చేసుకున్నాడు. | اِنَّهٗ فَكَّرَ وَقَدَّرَ ⑱ |
| **19.** వాడు నాశనం గాను! ఎటువంటి ప్రతిపాదన చేశాడు వాడు! | فَقُتِلَ كَيْفَ قَدَّرَ ⑲ |
| **20.** అవును వాడు నాశనమైపోను! ఎలాంటి (తప్పుడు) ప్రతిపాదన చేశాడు వాడు! | ثُمَّ قُتِلَ كَيْفَ قَدَّرَ ⑳ |
| **21.** అప్పుడు వాడు దృష్టిని సారించాడు (ఆలోచించాడు). | ثُمَّ نَظَرَ ㉑ |
| **22.** తరువాత అతడు నుదురు చిట్లించుకున్నాడు మరియు కోపంతో చూశాడు (ముఖం మాడ్చుకున్నాడు); | ثُمَّ عَبَسَ وَبَسَرَ ㉒ |
| **23.** తరువాత అతడు వెనుకకు మరలి దురహంకారం చూపాడు. [3] | ثُمَّ اَدْبَرَ وَاسْتَكْبَرَ ㉓ |
| **24.** చివరికి ఇలా అన్నాడు: "ఇది పూర్వం నుండి నకలు చేయబడుతూ వస్తున్న మంత్రజాలం మాత్రమే! | فَقَالَ اِنْ هٰذَآ اِلَّا سِحْرٌ يُّؤْثَرُ ㉔ |
| **25.** "ఇది మానవ వాక్కు తప్ప మరేమీ కాదు!" | اِنْ هٰذَآ اِلَّا قَوْلُ الْبَشَرِ ㉕ |
| **26.** త్వరలోనే నేను అతనిని నరకాగ్నికి ఆహుతి చేస్తాను. | سَاُصْلِيْهِ سَقَرَ ㉖ |
| **27.** మరియు ఆ నరకాగ్ని ఎటువంటిదో నీకేం తెలుసు? [4] | وَمَآ اَدْرٰىكَ مَا سَقَرُ ㉗ |

---

3) చూడండి, 96:6-7.

4) **సఖరున్: నరకానికి ఏడు అంతస్తులు** లేక శ్రేణులున్నాయి. (i) *జహన్నమ్* (నరకం), (ii) *ల''జ్జా* (ధ్వంసం చేసే అగ్ని), (iii) *'హు'త్మ* (అణగ / చితకగొట్టే శిక్ష), (iv) *స'యీర్* (ప్రజ్వలించే అగ్ని), (v) *సఖర్* (నరకాగ్ని), (vi) *జ'హీమ్* (మండే అగ్ని), (vii) *హావియహ్.* ఇది అన్నిటి కంటే క్రింది అంతస్తు, ఇందులో మునాఫిఖులు (కపట-

**28.** అది (ఏ పాపాత్ముణ్ణీ) మిగల్చదు మరియు (దేనినీ కాల్చకుండా) వదలి పెట్టదు.[5]

لَا تُبْقِي وَلَا تَذَرُ ﴿٢٨﴾

**29.** అది మానవుణ్ణి (అతడి చర్మాన్ని) దహించి వేస్తుంది.[6]

لَوَّاحَةٌ لِّلْبَشَرِ ﴿٢٩﴾

**30.** దానిపై **పందొమ్మిది** (దైవదూతలు నియమించబడి) ఉన్నారు.

عَلَيْهَا تِسْعَةَ عَشَرَ ﴿٣٠﴾

**31.** మరియు మేము దైవదూతలను మాత్రమే నరకానికి రక్షకులుగా నియమించాము. మరియు మేము వారి సంఖ్యను (పందొమ్మిదిని), సత్య-తిరస్కారులకు ఒక పరీక్షగా, గ్రంథ ప్రజలకు నమ్మకం కలగటానికి, విశ్వాసుల విశ్వాసాన్ని అధికం చేయటానికి మరియు గ్రంథ ప్రజలు మరియు విశ్వాసులు సందేహంలో పడకుండా ఉండటానికి మరియు తమ హృదయాలలో రోగమున్న వారు మరియు సత్య-తిరస్కారులు: "ఈ ఉపమానం ఇవ్వటంలో అల్లాహ్ ఉద్దేశ్యమేమిటి?" అని పలుకటానికి! ఈ విధంగా అల్లాహ్ తాను కోరిన వారిని మార్గభ్రష్టత్వంలో వదులుతాడు. మరియు తాను కోరినవారికి మార్గదర్శకత్వం చేస్తాడు. [7] మరియు నీ ప్రభువు సైన్యాలను ఆయన తప్ప మరెవ్వరూ ఎరుగరు. మరియు ఇదంతా (ఈ నరక వృత్తాంతం) మానవునికి ఒక జ్ఞాపిక (హితబోధ) మాత్రమే.

وَمَا جَعَلْنَآ اَصْحٰبَ النَّارِ اِلَّا
مَلٰٓئِكَةً ۙ وَّمَا جَعَلْنَا عِدَّتَهُمْ اِلَّا
فِتْنَةً لِّلَّذِيْنَ كَفَرُوْا ۙ لِيَسْتَيْقِنَ
الَّذِيْنَ اُوْتُوا الْكِتٰبَ وَيَزْدَادَ
الَّذِيْنَ اٰمَنُوْٓا اِيْمَانًا وَّلَا يَرْتَابَ
الَّذِيْنَ اُوْتُوا الْكِتٰبَ وَالْمُؤْمِنُوْنَ ۙ
وَلِيَقُوْلَ الَّذِيْنَ فِيْ قُلُوْبِهِمْ مَّرَضٌ
وَّالْكٰفِرُوْنَ مَاذَآ اَرَادَ اللّٰهُ بِهٰذَا
مَثَلًا ؕ كَذٰلِكَ يُضِلُّ اللّٰهُ مَنْ
يَّشَآءُ وَيَهْدِيْ مَنْ يَّشَآءُ ؕ وَمَا
يَعْلَمُ جُنُوْدَ رَبِّكَ اِلَّا هُوَ ؕ وَمَا
هِيَ اِلَّا ذِكْرٰى لِلْبَشَرِ ﴿٣١﴾

---

విశ్వాసులు) ఉంటారు. ఏడు ద్వారాలు అంటే ఏడు విధాలైన పాపుల దారులు. చూడండి, 15:44.

5) అంటే అది నరకవాసులను బ్రతుకనివ్వదూ మరియు చావనివ్వదూ, వారి శరీరపు ప్రతి భాగాన్ని కాల్చుతుంది.

6) చూడండి, 87:12-13.

7) చూడండి, 2:26.

**32.** అలా కాదు! చంద్రుని సాక్షిగా!

كَلَّا وَالْقَمَرِ ﴿32﴾

**33.** గడిచిపోయే రాత్రి సాక్షిగా!

وَالَّيْلِ اِذْ اَدْبَرَ ﴿33﴾

**34.** ప్రకాశించే, ఉదయం సాక్షిగా!

وَالصُّبْحِ اِذَآ اَسْفَرَ ﴿34﴾

**35.** నిశ్చయంగా, ఇది (ఈ నరకాగ్ని) ఒక పెద్ద విషయం.

اِنَّهَا لَاِحْدَى الْكُبَرِ ﴿35﴾

**36.** మానవునికి ఒక హెచ్చరిక;

نَذِيْرًا لِّلْبَشَرِ ﴿36﴾

**37.** మీలో ముందుకు రావాలని కోరుకునే వానికి లేదా వెనుక ఉండిపోయేవానికి;

لِمَنْ شَآءَ مِنْكُمْ اَنْ يَّتَقَدَّمَ اَوْ يَتَاَخَّرَ ﴿37﴾

**38.** ప్రతి మానవుడు తాను చేసిన కర్మలకు తాకట్టుగా ఉంటాడు.

كُلُّ نَفْسٍۭ بِمَا كَسَبَتْ رَهِيْنَةٌ ﴿38﴾

**39.** కుడి పక్షంవారు తప్ప!

اِلَّآ اَصْحٰبَ الْيَمِيْنِ ﴿39﴾

**40.** వారు స్వర్గవనాలలో పరస్పరం అడుగుతూ ఉంటారు!

فِيْ جَنّٰتٍ ۛ يَتَسَآءَلُوْنَ ﴿40﴾

**41.** అపరాధులను గురించి (మరియు వారితో అంటారు):

عَنِ الْمُجْرِمِيْنَ ﴿41﴾

**42.** "మిమ్మల్ని ఏ విషయం నరకంలోకి ప్రవేశింపజేసింది?"

مَا سَلَكَكُمْ فِيْ سَقَرَ ﴿42﴾

**43.** వారు (నరకవాసులు) ఇలా జవాబి స్తారు: "మేము *నమా'జ్* చేసే వారం కాము.

قَالُوْا لَمْ نَكُ مِنَ الْمُصَلِّيْنَ ﴿43﴾

**44.** "మరియు నిరుపేదకు ఆహారం పెట్టే వాళ్ళం కాము;

وَلَمْ نَكُ نُطْعِمُ الْمِسْكِيْنَ ﴿44﴾

**45.** "మరియు వృథా కాలక్షేపం చేసే వారితో కలిసి వ్యర్థప్రలాపాలు (ప్రసంగాలు) చేస్తూ ఉండే వాళ్ళం;

وَكُنَّا نَخُوْضُ مَعَ الْخَآئِضِيْنَ ﴿45﴾

**46.** "మరియు తీర్పు దినాన్ని అబద్ధమని నిరాకరిస్తూ ఉండే వాళ్ళం;

وَكُنَّا نُكَذِّبُ بِيَوْمِ الدِّيْنِ ﴿46﴾

**47.** "చివరకు ఆ అనివార్యమైన విషయం (మృత్యువు) మాపై వచ్చి పడింది." [8]

حَتّٰٓى اَتٰىنَا الْيَقِيْنُ ﴿47﴾

---

8) చూడండి, 15:99.

**48.** అప్పుడు సిఫారసు చేసేవారి సిఫారసు, వారికి ఏ మాత్రం ఉపయోగపడదు. [9]

فَمَا تَنْفَعُهُمْ شَفَاعَةُ الشّٰفِعِيْنَ ؕ ﴿48﴾

**49.** అయితే, వారికేమయింది? ఈ హితోపదేశం నుండి వారెందుకు ముఖం త్రిప్పుకుంటున్నారు.

فَمَا لَهُمْ عَنِ التَّذْكِرَةِ مُعْرِضِيْنَ ۙ ﴿49﴾

**50.** వారి స్థితి బెదిరిన అడవి గాడిదల మాదిరిగా ఉంది;

كَاَنَّهُمْ حُمُرٌ مُّسْتَنْفِرَةٌ ۙ ﴿50﴾

**51.** సింహం నుండి పారిపోయే (గాడిదల మాదిరిగా)! [10]

فَرَّتْ مِنْ قَسْوَرَةٍ ؕ ﴿51﴾

**52.** అలా కాదు! వారిలో ప్రతిఒక్క వ్యక్తి తనకు విప్పబడిన దివ్యగ్రంథాలు ఇవ్వబడాలని కోరుతున్నాడు. [11]

بَلْ يُرِيْدُ كُلُّ امْرِئٍ مِّنْهُمْ اَنْ يُّؤْتٰى صُحُفًا مُّنَشَّرَةً ۙ ﴿52﴾

**53.** కాదు కాదు! అసలు వారు పరలోక జీవితం గురించి భయపడటంలేదు.

كَلَّا ؕ بَلْ لَّا يَخَافُوْنَ الْاٰخِرَةَ ؕ ﴿53﴾

**54.** అలాకాదు! నిశ్చయంగా, ఇది (ఈ ఖుర్ఆన్) ఒక హితోపదేశం.

كَلَّاۤ اِنَّهٗ تَذْكِرَةٌ ۚ ﴿54﴾

**55.** కావున కోరిన వాడు దీని నుండి హితబోధ గ్రహించవచ్చు.

فَمَنْ شَآءَ ذَكَرَهٗ ؕ ﴿55﴾

**56.** కాని అల్లాహ్ కోరితే తప్ప! [12] వీరు దీని నుండి హితబోధ గ్రహించలేరు. ఆయనే (అల్లాహ్ యే) భయభక్తులకు అర్హుడు మరియు ఆయనే క్షమించే అర్హత గలవాడు. (3/4)

وَمَا يَذْكُرُوْنَ اِلَّاۤ اَنْ يَّشَآءَ اللّٰهُ ؕ هُوَ اَهْلُ التَّقْوٰى وَاَهْلُ الْمَغْفِرَةِ ۧ ﴿56﴾

*****

---

9) ఫారస్ కొరకు చూడండి, 10:3.

10) దీనిని వ్యాఖ్యాతలు – సింహం, పులి లేక వేటగాడి నుండి – పారిపోవటం, అని అన్నారు.

11) విప్పబడిన గ్రంథాలు అంటే: ము'హమ్మద్ ('స'అ.స.) అల్లాహ్ (సు.త.) యొక్క ప్రవక్త అని వ్రాయబడిన గ్రంథం ప్రతి ఒక్కరికి ఇవ్వబడాలని లేక దైవగ్రంథం ప్రతి ఒక్కరికి ఇవ్వబడాలని. చూ. 2:118 వారు ఇలా పలకడం వారి దురహంకారాన్ని సూచిస్తుంది.

12) చూ. 81:28-29 మరియు 14:4. ***

## 75. సూరహ్ అల్-ఖియామహ్

سُوْرَةُ الْقِيَامَةِ

*అల్-ఖియామహ్:* The Resurrection, **పునరుత్థానం.** ఇందులో పునరుత్థాన దినం గురించి వివరాలున్నాయి. ఇది మొదటి **మక్కహ్** కాలపు *సూరహ్.* **40** *ఆయాతులున్న* ఈ *సూరహ్* పేరు **మొదటి** *ఆయత్* నుండి తీసుకోబడింది.

**అనంత కరుణామయుడు అపార కరుణాప్రదాత అయిన అల్లాహ్ పేరుతో**

بِسْمِ اللهِ الرَّحْمٰنِ الرَّحِيْمِ ○

**1.** * అలాకాదు! నేను **పునరుత్థానదినపు** ప్రమాణం చేస్తున్నాను.

لَآ اُقْسِمُ بِيَوْمِ الْقِيٰمَةِ ①

**2.** అలాకాదు! నేను తనను-తాను నిందించుకునే అంతరాత్మ ప్రమాణం చేస్తున్నాను.

وَلَآ اُقْسِمُ بِالنَّفْسِ اللَّوَّامَةِ ②

**3.** ఏమిటి? మేము అతని ఎముకలను కూర్చలేమని మానవుడు భావిస్తున్నాడా?

اَيَحْسَبُ الْاِنْسَانُ اَلَّنْ نَّجْمَعَ عِظَامَهٗ ③

**4.** వాస్తవానికి! మేము అతని వ్రేళ్ళకొనలను కూడా యథాతథంగా సవరించగల సమర్థులము (అధికారం గలవారము).

بَلٰى قٰدِرِيْنَ عَلٰٓى اَنْ نُّسَوِّيَ بَنَانَهٗ ④

**5.** అయినా, మానవుడు ఇక మీద కూడా దుష్కార్యాలు చేయగోరుతున్నాడు.

بَلْ يُرِيْدُ الْاِنْسَانُ لِيَفْجُرَ اَمَامَهٗ ⑤

**6.** అతడు ఇలా అడుగుతున్నాడు: "అయితే పునరుత్థాన (తీర్పు) దినం ఎప్పుడు రానున్నది?"

يَسْـَٔلُ اَيَّانَ يَوْمُ الْقِيٰمَةِ ⑥

**7.** కళ్ళు మిరుమిట్లుగొన్నప్పుడు;

فَاِذَا بَرِقَ الْبَصَرُ ⑦

**8.** మరియు చంద్రునికి గ్రహణం పట్టినప్పుడు;

وَخَسَفَ الْقَمَرُ ⑧

**9.** మరియు సూర్య-చంద్రులు కలిపివేయబడినప్పుడు;

وَجُمِعَ الشَّمْسُ وَالْقَمَرُ ⑨

**10.** మానవుడు ఆ రోజు: "నేను ఎక్కడికి పారి పోవాలి?" అని అంటాడు.

يَقُوْلُ الْاِنْسَانُ يَوْمَىِٕذٍ اَيْنَ الْمَفَرُّ ⑩

**11.** అదికాదు! (అతనికి) ఎక్కడా శరణం ఉండదు!

كَلَّا لَا وَزَرَ ⑪

| | |
|---|---|
| **12.** ఆ రోజు నీ ప్రభువు వద్దనే ఆశ్రయం ఉంటుంది. | اِلٰى رَبِّكَ يَوْمَىِٕذِ ۣالْمُسْتَقَرُّ ⑫ |
| **13.** ఆ రోజు మానవుడికి, తాను చేసి పంపింది మరియు వెనక వదలింది అంతా తెలుపబడుతుంది. [1] | يُنَبَّؤُا الْاِنْسَانُ يَوْمَىِٕذٍۢ بِمَا قَدَّمَ وَاَخَّرَ ⑬ |
| **14.** అలా కాదు! మానవుడు తనకు విరుద్ధంగా, తానే సాక్షి అవుతాడు; | بَلِ الْاِنْسَانُ عَلٰى نَفْسِهٖ بَصِيْرَةٌ ⑭ |
| **15.** మరియు అతడు ఎన్ని సాకులు చెప్పినా సరే! [2] | وَّلَوْ اَلْقٰى مَعَاذِيْرَهٗ ⑮ |
| **16.** నీవు దీనిని (ఈ ఖుర్ఆన్‌ను కంఠస్థం చేసుకోవటానికి) **నీ నాలుకను త్వరత్వరగా కదిలించకు.** [3] | لَا تُحَرِّكْ بِهٖ لِسَانَكَ لِتَعْجَلَ بِهٖ ⑯ |
| **17.** నిశ్చయంగా, దీనిని సేకరించడం మరియు దీనిని చదివించడం మా బాధ్యతే! | اِنَّ عَلَيْنَا جَمْعَهٗ وَقُرْاٰنَهٗ ⑰ |
| **18.** కావున మేము దీనిని పఠించినప్పుడు నీవు ఆ పారాయణాన్ని శ్రద్ధగా అనుసరించు. | فَاِذَا قَرَاْنٰهُ فَاتَّبِعْ قُرْاٰنَهٗ ⑱ |
| **19.** ఇక దాని భావాన్ని అర్థమయ్యేలా చేయటం మా బాధ్యతే! [4] | ثُمَّ اِنَّ عَلَيْنَا بَيَانَهٗ ⑲ |
| **20.** అలా కాదు! వాస్తవానికి మీరు అనిశ్చితమైన (ఇహలోక జీవితం పట్ల) వ్యామోహం పెంచుకుంటున్నారు; | كَلَّا بَلْ تُحِبُّوْنَ الْعَاجِلَةَ ⑳ |
| **21.** మరియు మీరు పరలోక జీవితాన్ని వదలిపెడుతున్నారు! [5] | وَتَذَرُوْنَ الْاٰخِرَةَ ㉑ |

---

1) చూడండి, 18:49.
2) చూడండి, 24:24, 36:25 లేక 41:20-22.
3) జిబ్రీల్ ('అ.స.) ఖుర్ఆన్ అవతరింపజేసేటప్పుడు, దైవప్రవక్త ('స'అ.స.) ఏ పదాన్ని కూడా మరచిపోరాదని త్వరత్వరగా చదివేవారు. అల్లాహుత'ఆలా త్వరత్వరగా చదువటం నుండి నివారించాడు. ('స. బు'ఖారీ) ఇటువంటి వాక్యానికై చూడండి, **20:114**.
4) దైవప్రవక్త ('స'అ.స.) ఖుర్ఆన్‌ను ప్రజలకు అర్థమవటానికి వివరించి చెప్పింది కూడా అల్లాహ్ (సు.త.) తరఫు నుండి, తనకు తెలుపబడిందే. ఈ వివరణలే '**హదీసు'లు**!
5) అంటే పరలోక జీవితాన్ని నమ్మటం లేదు. మీరు మీ జీవితం కేవలం ఈ ఇహలోక జీవితం మాత్రమే అనే భ్రమలో పడి ఉన్నారు. మీరు పునరుత్థరింపబడతారని నమ్మటం లేదు.

وُجُوْهٌ يَّوْمَىِٕذٍ نَّاضِرَةٌ ﴿٢٢﴾

**22.** ఆ రోజున కొన్ని ముఖాలు కళకళ లాడుతూ ఉంటాయి;

اِلٰى رَبِّهَا نَاظِرَةٌ ﴿٢٣﴾

**23.** తమ ప్రభువు (అల్లాహ్) వైపునకు చూస్తూ ఉంటాయి; [6]

وَوُجُوْهٌ يَّوْمَىِٕذٍۢ بَاسِرَةٌ ﴿٢٤﴾

**24.** మరికొన్ని ముఖాలు ఆ రోజు, కాంతి హీనమై ఉంటాయి; [7]

تَظُنُّ اَنْ يُّفْعَلَ بِهَا فَاقِرَةٌ ﴿٢٥﴾

**25.** నడుమును విరిచే బాధ వారికి కలుగు తుందని భావించి. [8]

كَلَّآ اِذَا بَلَغَتِ التَّرَاقِيَ ﴿٢٦﴾

**26.** అలా కాదు! ప్రాణం గొంతులోకి వచ్చి నప్పుడు; [9]

وَقِيْلَ مَنْ ٚ رَاقٍ ﴿٢٧﴾

**27.** మరియు: "మంత్రించువాడు ఎవడైనా ఉన్నాడా?" అని అనబడుతుంది.[10]

وَّظَنَّ اَنَّهُ الْفِرَاقُ ﴿٢٨﴾

**28.** మరియు అప్పుడతడు వాస్తవానికి తన ఎడబాటు కాలం వచ్చిందని గ్రహిస్తాడు;

وَالْتَفَّتِ السَّاقُ بِالسَّاقِ ﴿٢٩﴾

**29.** మరియు ఒక పిక్క మరొక పిక్కతో కలిసి పోతుంది.[11]

اِلٰى رَبِّكَ يَوْمَىِٕذِ اِۨلْمَسَاقُ ﴿٣٠﴾

**30.** ఆ రోజు నీ ప్రభువు వైపునకు సాగిపోవలసి ఉంటుంది!

فَلَا صَدَّقَ وَلَا صَلّٰى ﴿٣١﴾

**31.** కాని అతడు సత్యాన్ని నమ్మలేదు మరియు *నమాజ్* చేయనూ లేదు! [12]

وَلٰكِنْ كَذَّبَ وَتَوَلّٰى ﴿٣٢﴾

**32.** మరియు అతడు (ఈ సందేశాన్ని) అసత్యమన్నాడు మరియు దాని నుండి వెనుదిరిగాడు!

---

6) ఇవి విశ్వాసుల ముఖాలు.
7) ఇవి సత్య-తిరస్కారుల ముఖాలు.
8) అంటే వారు నరకంలో వేయబడతారని తెలుసుకొని.
9) మరణం ఆసన్నమైనప్పుడు.
10) ఇటువంటి *ఆయత్* కోసం చూడండి, 28:71-72.
11) అంటే అతడు, తాను కష్టాల పాలవుతున్నానని తెలుసుకుంటాడు.
12) చూడండి, 4:17-18.

| | |
|---|---|
| **33.** ఆ తరువాత నిక్కుతూ నీల్గుతూ తన ఇంటి వారి వద్దకు పోయాడు! | ثُمَّ ذَهَبَ اِلٰۤى اَهۡلِهٖ يَتَمَطّٰى ﴿33﴾ |
| **34.** (ఓ సత్య-తిరస్కారుడా!) శోచనీయం నీ వైఖరి కడు శోచనీయం! | اَوۡلٰى لَكَ فَاَوۡلٰى ﴿34﴾ |
| **35.** అవును, శోచనీయం (విచారకరం) నీ వైఖరి కడు శోచనీయం (విచారకరం)! | ثُمَّ اَوۡلٰى لَكَ فَاَوۡلٰى ﴿35﴾ |
| **36.** ఏమిటి? మానవుడు తనను విచ్చల విడిగా వదలిపెట్టడం జరుగుతుందని భావిస్తున్నాడా? | اَيَحۡسَبُ الۡاِنۡسَانُ اَنۡ يُّتۡرَكَ سُدًى ﴿36﴾ |
| **37.** ఏమీ? అతడు స్థలించబడిన ఒక వీర్య బిందువు కాడా? | اَلَمۡ يَكُ نُطۡفَةً مِّنۡ مَّنِىٍّ يُّمۡنٰى ﴿37﴾ |
| **38.** తరువాత ఒక రక్తకండగా (జలగగా) ఉండే వాడు కాదా? తరువాత ఆయనే (అల్లాహ్‌యే) అతనిని సృష్టించి అతని రూపాన్ని తీర్చిదిద్దాడు.[13] | ثُمَّ كَانَ عَلَقَةً فَخَلَقَ فَسَوّٰى ﴿38﴾ |
| **39.** ఆ తరువాత అతని నుండి స్త్రీ పురుషుల రెండు రకాలను (జాతులను) ఏర్పరచాడు. | فَجَعَلَ مِنۡهُ الزَّوۡجَيۡنِ الذَّكَرَ وَالۡاُنۡثٰى ﴿39﴾ |
| **40.** అలాంటప్పుడు ఆయనకు మరణించిన వారిని మళ్ళీ బ్రతికించే సామర్థ్యం లేదా? | اَلَيۡسَ ذٰلِكَ بِقٰدِرٍ عَلٰٓى اَنۡ يُّحۡــِىَ الۡمَوۡتٰى ﴿40﴾ |

*****

13) చూడండి, 87:2 మరియు 91:7. ***

## 76. సూరహ్ అల్-ఇన్సాన్

سُورَةُ الإِنْسَانِ

*అల్-ఇన్సాను:* The Man, **మానవుడు.** దీనికి సూరహ్ **అద్-దహ్ర్,** The Time, కాలము, సమయం అనే పేరు కూడా ఉంది. దైవప్రవక్త ('స'అ.స.) **జుము'అహ్ రోజు, ఫజ్ర్** *నమాజులో సూరహ్ అస్-సజ్దా* (32) మరియు ఈ *సూరహ్* (76) చదివే వారు ('స'హీ'హ్ ముస్లిం). చాలా మంది వ్యాఖ్యాతల అభిప్రాయంలో ఈ *సూరహ్* **మదీనహ్** లో అవతరింపజేయబడింది, (ఫ'త్హ్ అల్-ఖదీర్). **31** *ఆయాతులున్న* ఈ *సూరహ్* పేరు **మొదటి** *ఆయత్* నుండి తీసుకోబడింది.

بِسْمِ اللّٰهِ الرَّحْمٰنِ الرَّحِيْمِ ○

**అనంత కరుణామయుడు అపార కరుణాప్రదాత అయిన అల్లాహ్ పేరుతో**

هَلْ اَتٰى عَلَى الْاِنْسَانِ حِيْنٌ مِّنَ الدَّهْرِ لَمْ يَكُنْ شَيْـًٔا مَّذْكُوْرًا ①

**1.** అనంతమైన కాలంలో, **మానవుడు** తాను చెప్పుకోదగిన వస్తువు కాకుండా ఉన్న సమయం గడవలేదా?

اِنَّا خَلَقْنَا الْاِنْسَانَ مِنْ نُّطْفَةٍ اَمْشَاجٍ ۖ نَّبْتَلِيْهِ فَجَعَلْنٰهُ سَمِيْعًاۢ بَصِيْرًا ②

**2.** నిశ్చయంగా, మేము, మానవుణ్ణి ఒక మిశ్రమ వీర్యబిందువుతో సృష్టించాము. [1] – అతనిని పరీక్షించటానికి – మేము అతనిని వినేవాడిగా, చూసేవాడిగా చేశాము. [2]

اِنَّا هَدَيْنٰهُ السَّبِيْلَ اِمَّا شَاكِرًا وَّاِمَّا كَفُوْرًا ③

**3.** నిశ్చయంగా, మేము అతనికి మార్గం చూపాము. ఇక అతడు కృతజ్ఞుడు కావచ్చు, లేదా కృతఘ్నుడూ కావచ్చు! [3]

اِنَّآ اَعْتَدْنَا لِلْكٰفِرِيْنَ سَلٰسِلَا۟ وَاَغْلٰلًا وَّسَعِيْرًا ④

**4.** నిశ్చయంగా, మేము సత్య-తిరస్కారుల కొరకు సంకెళ్ళను, మెడలో పట్టాలను మరియు భగభగ మండే నరకాగ్నిని (*స'ఈరాను*) సిద్ధపరచి ఉంచాము.[4]

---

1) అంటే స్త్రీ-పురుషుల వీర్యబిందువుల మిశ్రమంతో! అంటే పురుషుని రేతస్సు, లేక వీర్య బిందువు, లేక శుక్ల (Sperm) మరియు స్త్రీ బీజకణం (Ovum) చూడండి, **86:6-7.**
2) పరీక్షించటం కోసం, చూడండి, 67:2.
3) ప్రతి మానవుడు తన ఆత్మను వ్యాపారంలో పెడ్తాడు. దానిని నష్టంలో పడవేస్తాడు లేక లాభంలో ('స. ముస్లిం). నష్టం అంటే నరకం, లాభం అంటే స్వర్గం. ఇంకా చూడండి, 90:10.
4) ఇది అల్లాహ్ (సు.త.) ప్రసాదించిన స్వేచ్ఛను చెడు మార్గంలో వినియోగించటం వల్ల లభించే ప్రతిఫలం. ఇంకా చూడండి, 73:12-13.

**5.** నిశ్చయంగా, పుణ్యాత్ములు కాఫూర్ కలుపబడిన మధు పాత్రలను సేవిస్తారు. [5]

اِنَّ الْاَبْرَارَ يَشْرَبُوْنَ مِنْ كَاْسٍ كَانَ مِزَاجُهَا كَافُوْرًا ۚ ⑤

**6.** ధారాళంగా పొంగి ప్రవహింపజేయబడే ఊటల నుండి, అల్లాహ్ దాసులు (తనివితీరా) త్రాగుతారు. వారు దానిని (తాము కోరిన చోటునకు) ప్రవహింపజేస్తారు. [6]

عَيْنًا يَّشْرَبُ بِهَا عِبَادُ اللّٰهِ يُفَجِّرُوْنَهَا تَفْجِيْرًا ⑥

**7.** వారు తమ మొక్కుబడులను పూర్తిచేసుకున్నవారై ఉంటారు. [7] మరియు దాని హాని అన్ని వైపులా క్రమ్ముకొనే, ఆ దినమును గురించి భయపడుతూ ఉంటారు.

يُوْفُوْنَ بِالنَّذْرِ وَيَخَافُوْنَ يَوْمًا كَانَ شَرُّهٗ مُسْتَطِيْرًا ⑦

**8.** మరియు అది తమకు ప్రీతికరమైనప్పటికీ, వారు నిరుపేదలకు మరియు అనాధులకు మరియు ఖైదీలకు, ఆహారంపెట్టే వారై ఉంటారు.[8]

وَيُطْعِمُوْنَ الطَّعَامَ عَلٰى حُبِّهٖ مِسْكِيْنًا وَّيَتِيْمًا وَّاَسِيْرًا ⑧

**9.** (వారు ఇలా అంటారు): "వాస్తవానికి మేము అల్లాహ్ ప్రసన్నత కొరకే మీకు ఆహారం పెడుతున్నాము. మేము మీ నుండి ఎలాంటి ప్రతిఫలం గానీ, లేదా కృతజ్ఞతలు గానీ ఆశించటం లేదు.

اِنَّمَا نُطْعِمُكُمْ لِوَجْهِ اللّٰهِ لَا نُرِيْدُ مِنْكُمْ جَزَآءً وَّلَا شُكُوْرًا ⑨

**10.** "నిశ్చయంగా, మేము మా ప్రభువు నుండి వచ్చే ఉగ్రమైన, దుర్భరమైన, ఆ దినానికి భయపడుతున్నాము!"

اِنَّا نَخَافُ مِنْ رَّبِّنَا يَوْمًا عَبُوْسًا قَمْطَرِيْرًا ⑩

---

5) చూడండి, 83:25-28.

6) అంటే అది ఎన్నటికీ తరిగిపోదు.

7) మొక్కుబడులు కేవలం అల్లాహ్ (సు.త.)కే చేస్తారు. మరియు వాటిని పూర్తిచేస్తారు. 'అల్లాహ్ (సు.త.) పేరుతో మొక్కుబడి చేసుకుంటే దానిని పూర్తిచేసుకోవాలి.' ('స. బు'ఖారీ).

8) పైది నోబుల్ ఖుర్ఆన్ తాత్పర్యము. జూనాగఢీ గారు: 'ఆయన (అల్లాహ్) ప్రీతి కొరకు వారు....' అని తాత్పర్యమిచ్చారు. దైవప్రవక్త ('స'అ.స.) ఆదేశానుసారం *'స'హాబీలు* (ర'ది.'అన్హుమ్) బద్ర్ యుద్ధ ఖైదీలకు మొదట అన్నం పెట్టి, తరువాత తాము తినేవారు, (ఇబ్నె-కసీ'ర్). మన అధీనంలో ఉన్న సేవకులతో కూడా మంచిగా వ్యవహరించాలి. దైవప్రవక్త ('స'అ.స.) చివరి ఉపదేశం: *"నమా'జ్‌ను మరియు మీ సేవకులను ఆదరించండి."* (ఇబ్నె-మాజా). ఇంకా చూడండి, 2:177 మరియు 90:14-16.

**11.** కావున అల్లాహ్ వారిని ఆ దినపు కీడు నుండి కాపాడాడు. మరియు వారికి ఉల్లాసాన్ని మరియు ఆనందాన్ని ప్రసాదించాడు.

فَوَقٰىهُمُ اللّٰهُ شَرَّ ذٰلِكَ الْيَوْمِ وَلَقّٰىهُمْ نَضْرَةً وَّسُرُوْرًا ⑪

**12.** మరియు వారి సహనానికి [9] ప్రతిఫలంగా వారికి స్వర్గాన్ని మరియు పట్టు వస్త్రాలను ఇచ్చాడు. [10]

وَجَزٰىهُمْ بِمَا صَبَرُوْا جَنَّةً وَّحَرِيْرًا ⑫

**13.** అందులోవారు ఎత్తైన పీఠాల మీద దిండ్లకు ఆనుకొని కూర్చొని ఉంటారు. అందులో వారు ఎండ (బాధ) గానీ, చలి తీవ్రతను గానీ చూడరు!

مُّتَّكِـِٕيْنَ فِيْهَا عَلَى الْاَرَآئِكِ ۚ لَا يَرَوْنَ فِيْهَا شَمْسًا وَّلَا زَمْهَرِيْرًا ⑬

**14.** మరియు అందులో వారిపై నీడలు పడుతుంటాయి. [11] దాని ఫలాల గుత్తులు వారికి అందుబాటులో ఉంటాయి.

وَدَانِيَةً عَلَيْهِمْ ظِلٰلُهَا وَذُلِّلَتْ قُطُوْفُهَا تَذْلِيْلًا ⑭

**15.** మరియు వారి మధ్య వెండి పాత్రలు మరియు గాజు గ్లాసులు త్రిప్పబడుతూ ఉంటాయి.

وَيُطَافُ عَلَيْهِمْ بِاٰنِيَةٍ مِّنْ فِضَّةٍ وَّاَكْوَابٍ كَانَتْ قَوَارِيْرَا۠ ⑮

**16.** ఆ గాజు గ్లాసులు స్ఫటికంవలే తెల్లనైన వెండితో చేయబడి ఉంటాయి. అవి నియమబద్ధంగా నింపబడి ఉంటాయి.

قَوَارِيْرَا۠ مِنْ فِضَّةٍ قَدَّرُوْهَا تَقْدِيْرًا ⑯

**17.** మరియు వారికి శొంటి కలిపిన మధుపాత్రలు త్రాగటానికి ఇవ్వబడతాయి.[12]

وَيُسْقَوْنَ فِيْهَا كَاْسًا كَانَ مِزَاجُهَا زَنْجَبِيْلًا ⑰

**18.** అది (స్వర్గంలోని) *సల్‌సబీల్* అనే పేరుగల ఒక ఊట! (7/8)

عَيْنًا فِيْهَا تُسَمّٰى سَلْسَبِيْلًا ⑱

**19.** * మరియు వారి మధ్య శాశ్వతంగా, యవ్వనులుగా ఉండే బాలురు తిరుగుతూ ఉంటారు. మరియు నీవు వారిని చూస్తే,

وَيَطُوْفُ عَلَيْهِمْ وِلْدَانٌ مُّخَلَّدُوْنَ ۚ اِذَا رَاَيْتَهُمْ حَسِبْتَهُمْ لُؤْلُؤًا مَّنْثُوْرًا ⑲

---

9) 'సబరున్: సహనం, అంటే ధర్మ మార్గంలో వచ్చే కష్టాలను భరించటం. అల్లాహ్ (సు.త.) ఆజ్ఞాపాలన కొరకు తమ సుఖసంతోషాలను మరియు అపేక్షలను త్యాగం చేయటం. అల్లాహ్ (సు.త.) అవిధేయత నుండి దూరంగా ఉండటం.

10) చూడండి, 18:31.

11) చూడండి, 4:57.

12) చూడండి, 43:71.

వారిని వెదజల్లిన ముత్యాలుగా భావిస్తావు.[13]

وَإِذَا رَأَيْتَ ثَمَّ رَأَيْتَ نَعِيمًا وَمُلْكًا كَبِيرًا ⑳

**20.** మరియు నీవు అక్కడ (స్వర్గంలో) చూస్తే, ఎక్కడచూసినా ఆనందమే పొందుతావు. మరియు ఒక మహత్తర సామ్రాజ్య వైభవం కనిపిస్తుంది.

عَالِيَهُمْ ثِيَابُ سُندُسٍ خُضْرٌ وَإِسْتَبْرَقٌ ۖ وَحُلُّوا أَسَاوِرَ مِن فِضَّةٍ وَسَقَاهُمْ رَبُّهُمْ شَرَابًا طَهُورًا ㉑

**21.** వారి ఒంటి మీద సన్నని ఆకు పచ్చని శ్రేష్ఠమైన పట్టు వస్త్రాలు మరియు బంగారు జలతారు అల్లిన దుస్తులుంటాయి. మరియు వారికి వెండి కంకణాలు తొడిగించబడతాయి మరియు వారి ప్రభువు వారికి నిర్మలమైన పానీయాన్ని త్రాగటానికి ప్రసాదిస్తాడు.

إِنَّ هَٰذَا كَانَ لَكُمْ جَزَاءً وَكَانَ سَعْيُكُم مَّشْكُورًا ㉒

**22.** (వారితో ఇలా అనబడుతుంది): "నిశ్చయంగా, ఇది మీకు ఇవ్వబడే ప్రతిఫలం. ఎందుకంటే, మీ శ్రమ అంగీకరించబడింది."

إِنَّا نَحْنُ نَزَّلْنَا عَلَيْكَ الْقُرْآنَ تَنزِيلًا ㉓

**23.** నిశ్చయంగా మేమే, ఈ ఖుర్ఆన్‌ను నీపై (ఓ ము'హమ్మద్!) క్రమక్రమంగా అవతరింపజేశాము.

فَاصْبِرْ لِحُكْمِ رَبِّكَ وَلَا تُطِعْ مِنْهُمْ آثِمًا أَوْ كَفُورًا ㉔

**24.** కావున నీవు నీ ప్రభువు యొక్క ఆజ్ఞపై స్థిరంగా ఉండు మరియు వీరిలోని ఏ పాపి యొక్క లేదా సత్య-తిరస్కారుని యొక్క మాటగాని వినకు.[14]

وَاذْكُرِ اسْمَ رَبِّكَ بُكْرَةً وَأَصِيلًا ㉕

**25.** మరియు నీ ప్రభువు నామాన్ని ఉదయం మరియు సాయంత్రం స్మరిస్తూ ఉండు.[15]

---

13) వారు ఎల్లప్పుడూ బాలురుగానే ఉంటారు. వారు వృద్ధులు కారు. వారికి మరణంరాదు. ఇంకా చూడండి, 56:17-18 మరియు 52:24.

14) మక్కహ్ సత్యతిరస్కారులు దైవప్రవక్త ('స'అ.స.)ను: అతని ధర్మప్రచారాన్ని ఆపమనే వారు. మరియు తమ దేవతలను ఆరాధించమనే వారు. దానికి బదులుగా వారు అతనికి కోరినంత ధనం, అధికారం, ఇస్తామనే వారు. మరియు అతనికి ఇష్టమైన స్త్రీతో వివాహం చేయిస్తాం అనేవారు. (ఫ'త్హ్ అల్-ఖదీర్ /షౌకాని).

15) అంటే అన్ని వేళలో, అంటే సూర్యోదయానికి ముందు **ఫజ్ర్**, మధ్యాహ్నం దాటాక ''**జుహ్ర్** మరియు సాయంత్రం '**అస్ర్** నమా'జ్‌లు.

**26.** మరియు రాత్రివేళ ఆయన సన్నిధిలో సాష్టాంగం (సజ్దా) చేస్తూ ఉండు [16] మరియు రాత్రి వేళ సుదీర్ఘ కాలం, ఆయన పవిత్రతను కొనియాడుతూ ఉండు.

وَمِنَ الَّيْلِ فَاسْجُدْ لَهٗ وَسَبِّحْهُ لَيْلًا طَوِيْلًا ﴿26﴾

**27.** నిశ్చయంగా, వీరు తాత్కాలికమైన ఈ ప్రాపంచిక జీవితం పట్ల మోహితులై ఉన్నారు. మరియు మున్ముందు రానున్న భారమైన దినాన్ని విస్మరిస్తున్నారు. [17]

اِنَّ هٰٓؤُلَآءِ يُحِبُّوْنَ الْعَاجِلَةَ وَيَذَرُوْنَ وَرَآءَهُمْ يَوْمًا ثَقِيْلًا ﴿27﴾

**28.** మేమే వీరిని సృష్టించాము. మరియు వీరి శరీరాన్ని దృఢపరిచాము. మరియు మేము తలచుకున్నప్పుడు వీరికి బదులుగా వీరి వంటి వేరే వారిని తేగలము.

نَحْنُ خَلَقْنٰهُمْ وَشَدَدْنَآ اَسْرَهُمْ ۚ وَاِذَا شِئْنَا بَدَّلْنَآ اَمْثَالَهُمْ تَبْدِيْلًا ﴿28﴾

**29.** నిశ్చయంగా, ఇదొక హితోపదేశం. కాబట్టి, ఎవడైతే తన ప్రభువు వైపునకు తీసుకుపోయే మార్గాన్ని అవలంబించ దలచినాడో, వాడు దీనిని అనుసరించవచ్చు!

اِنَّ هٰذِهٖ تَذْكِرَةٌ ۚ فَمَنْ شَآءَ اتَّخَذَ اِلٰى رَبِّهٖ سَبِيْلًا ﴿29﴾

**30.** మరియు, అల్లాహ్ కోరనిదే, మీరు కోరలేరు! నిశ్చయంగా, అల్లాహ్ సర్వజ్ఞుడు, మహా వివేకవంతుడు.

وَمَا تَشَآءُوْنَ اِلَّآ اَنْ يَّشَآءَ اللّٰهُ ؕ اِنَّ اللّٰهَ كَانَ عَلِيْمًا حَكِيْمًا ۖ ﴿30﴾

**31.** తాను కోరిన వారిని ఆయన, తన కారుణ్యంలోకి తీసుకుంటాడు. మరియు దుర్మార్గుల కొరకు, ఆయన ఎంతో బాధాకరమైన శిక్షను సిద్ధపరచి ఉంచాడు.

يُّدْخِلُ مَنْ يَّشَآءُ فِيْ رَحْمَتِهٖ ؕ وَالظّٰلِمِيْنَ اَعَدَّ لَهُمْ عَذَابًا اَلِيْمًا ﴿31﴾ ع

*****

---

16) సూర్యాస్తమయం తరువాత **మ'గ్‌రిబ్** మరియు రాత్రి వేళలో **'ఇషా** నమా'జ్‌లు మరియు అర్ధ రాత్రి తరువాత **తహజ్జుద్** నమా'జ్‌లు.

17) భారమైన దినం అంటే పునరుత్థాన దినం. ***

## 77. సూరహ్ అల్-ముర్సలాత్

سُورَةُ المُرسَلَاتِ

*అల్-ముర్సలాతు:* Those sent forth, **పంపబడ్డవి.** ఇది ఆరంభ **మక్కహ్** కాలపు *సూరాహ్లలో* ఒకటి. ఈ *సూరహ్* సత్య-తిరస్కారులను రాబోయే జీవితపు శిక్ష గురించి హెచ్చరిస్తుంది. 'అబ్దుల్లాహ్ ఇబ్నె-మస్'ఊద్ (ర'ది.'అ.) కథనం: "మేము **మునా**లోని ఒక గుహలో ఉండగా ఈ *సూరహ్* అవతరింపజేయబడింది. దైవప్రవక్త ('స'అ.స.) దీనిని చదువు తుండగా అకస్మాత్తుగా ఒక పాము వచ్చింది. దైవప్రవక్త ('స'అ.స.) దానిని చంపమన్నారు. కాని అది త్వరగా వెళ్ళిపోయింది. అప్పుడు అతను ('స'అ.స.) అన్నారు: 'నీవు దాని హాని నుండి మరియు అది నీ హాని నుండి తప్పించుకున్నారు.' " ('స'హీ'హ్ బు'ఖారీ మరియు 'స. ముస్లిం) దైవప్రవక్త ('స'అ.స.) కొన్నిసార్లు *మ'గ్రిబ్ నమా'జ్లో* ఈ *సూరహ్* చదివేవారు ('స'హీ'హ్ బు'ఖారీ). **50** *ఆయాతు*లున్న ఈ *సూరహ్* పేరు **మొదటి** *ఆయత్* నుండి తీసుకోబడింది.

**అనంత కరుణామయుడు అపార కరుణాప్రదాత అయిన అల్లాహ్ పేరుతో**

بِسۡمِ ٱللَّهِ ٱلرَّحۡمَٰنِ ٱلرَّحِيمِ ○

**1.** వరుసగా ఒకదాని తర్వాత ఒకటి, **పంపబడే** వాటి (గాలుల) సాక్షిగా! [1]

وَٱلۡمُرۡسَلَٰتِ عُرۡفًا ①

**2.** మరియు తీవ్రమైన వేగంతో వీచే వాటి (పెనుగాలుల) సాక్షిగా! [2]

فَٱلۡعَٰصِفَٰتِ عَصۡفًا ②

**3.** మరియు మేఘాలను దూర-దూరంగా వ్యాపింపజేసే వాటి (పెనుగాలుల) సాక్షిగా! [3]

وَٱلنَّٰشِرَٰتِ نَشۡرًا ③

**4.** మరియు మంచి చెడులను (సత్యా సత్యాలను) విశదపరచే వాటి సాక్షిగా! [4]

فَٱلۡفَٰرِقَٰتِ فَرۡقًا ④

---

1) లేక దైవదూతల, లేక సందేశహరుల సాక్షిగా అని కొందరు వ్యాఖ్యాతల అభిప్రాయం. *'ఉర్ఫన్*-అంటే దివ్యజ్ఞానం (*వ'హీ*) లేక *షరీయత్* ఆజ్ఞలని కొందరు వ్యాఖ్యాతల అభిప్రాయం.

2) లేక దైవదూతల సాక్షిగా! ఎవరైతే తీవ్రంగా వీచే గాలులతో సహా పంపబడతారో!

3) లేక దైవదూతల సాక్షిగా! ఇబ్నె-కసీ'ర్, 'తబరీ మరియు ఇతర చాలా మంది వ్యాఖ్యాతలు కూడా (రహ్మ.) ఈ మూడు ఆయతులలో గాలుల ప్రస్తావన ఉందనే అభిప్రాయపడ్డారు.

4) నోబుల్ ఖుర్ఆనులో "...విశదపరచే దాని (ఖుర్ఆన్ *ఆయాతుల*) సాక్షిగా!" అని ఉంది. చూ. 2:53 మరియు 8: 29.

فَالْمُلْقِيٰتِ ذِكْرًا ⑤

5. సందేశాలను ప్రవక్తల వద్దకు తెచ్చే (దైవదూత) సాక్షిగా! [5]

عُذْرًا اَوْ نُذْرًا ⑥

6. సాకులు లేకుండా చేయటానికి లేక హెచ్చరించటానికి! [6]

اِنَّمَا تُوْعَدُوْنَ لَوَاقِعٌ ⑦

7. నిశ్చయంగా, మీకు చేయబడ్డ వాగ్దానం వచ్చి తీరుతుంది.

فَاِذَا النُّجُوْمُ طُمِسَتْ ⑧

8. నక్షత్రాలు కాంతిహీనమై పోయినప్పుడు!

وَاِذَا السَّمَآءُ فُرِجَتْ ⑨

9. మరియు ఆకాశం చీలిపోయినప్పుడు!

وَاِذَا الْجِبَالُ نُسِفَتْ ⑩

10. మరియు పర్వతాలు పొడిగా మారి, చెల్లాచెదురుగా చేయబడినప్పుడు!

وَاِذَا الرُّسُلُ اُقِّتَتْ ⑪

11. మరియు ప్రవక్తలు తమ నిర్ణీత సమయంలో సమావేశపరచబడినప్పుడు! [7]

لِاَيِّ يَوْمٍ اُجِّلَتْ ⑫

12. ఏ దినానికి గాను, (ఇవన్నీ) వాయిదా వేయబడ్డాయి?

لِيَوْمِ الْفَصْلِ ⑬

13. తీర్పు దినం కోసం! [8]

وَمَآ اَدْرٰىكَ مَا يَوْمُ الْفَصْلِ ⑭

14. మరియు ఆ తీర్పు దినం అంటే ఏమిటో నీకెలా అర్థం కాగలదు?

وَيْلٌ يَّوْمَىِٕذٍ لِّلْمُكَذِّبِيْنَ ⑮

15. ఆ రోజు అసత్యవాదులకు వినాశం ఉంది!

اَلَمْ نُهْلِكِ الْاَوَّلِيْنَ ⑯

16. ఏమీ? మేము పూర్వీకులను నాశనం చేయలేదా?

---

5) లేక అల్లాహ్ (సు.త.) యొక్క వహీని ప్రజలకు అందజేసే ప్రవక్త ('అ.స.)ల సాక్షిగా! ఇమామ్ షౌకాని అభిప్రాయంలో, *ముర్సలాత్, 'ఆసిఫాత్* మరియు *నాషిరాత్* – గాలులను బోధిస్తున్నాయి మరియు *ఫారిఖాత్, ముల్ఖియాత్* – దైవదూత ('అ.స.) లను. ఈ వ్యాఖ్యానంతో కూడా చాలా మంది వ్యాఖ్యాతలు ఏకీభవిస్తున్నారు.

6) దీని మరొక తాత్పర్యం: "(మానవులకు) తెలియజేసే ఉద్దేశంతో గాని, లేక హెచ్చరిక చేయటానికి గాని."

7) చూడండి, 4:41-42, 5:109, 7:6 లేక 39:69.

8) *యౌముల్ ఫస్ల్:* పునరుత్థాన దినం. ఖుర్ఆన్ అవతరణాక్రమంలో ఇక్కడ మొదటి సారి పేర్కొనబడింది. ఇంకా చూడండి, 37:21, 44:40, 78:17 మరియు 77:38.

**17.** మరియు మేము వారి తర్వాత, వెనుకటి తరాల వారిని తీసుకుని వచ్చాము.

ثُمَّ نُتْبِعُهُمُ الْاٰخِرِيْنَ (17)

**18.** మేము అపరాధులతో ఇదే విధంగా వ్యవహరిస్తాము.

كَذٰلِكَ نَفْعَلُ بِالْمُجْرِمِيْنَ (18)

**19.** ఆ రోజు అసత్యవాదులకు వినాశం ఉంది!

وَيْلٌ يَّوْمَىِٕذٍ لِّلْمُكَذِّبِيْنَ (19)

**20.** ఏమీ? మేము మిమ్మల్ని తుచ్ఛమైన నీటితో (వీర్య బిందువుతో) సృష్టించ లేదా?

اَلَمْ نَخْلُقْكُّمْ مِّنْ مَّآءٍ مَّهِيْنٍ (20)

**21.** తరువాత మేము దానిని ఒక భద్రమైన స్థానంలో ఉంచాము –

فَجَعَلْنٰهُ فِيْ قَرَارٍ مَّكِيْنٍ (21)

**22.** ఒక నిర్ణీత కాలం వరకు.

اِلٰى قَدَرٍ مَّعْلُوْمٍ (22)

**23.** ఈ విధంగా మేము నిర్ణయించాము. ఎందుకంటే మేమే ఉత్తమమైన నిర్ణయాలు తీసుకునే వారము. [9]

فَقَدَرْنَا ۖ فَنِعْمَ الْقٰدِرُوْنَ (23)

**24.** ఆ రోజు అసత్యవాదులకు వినాశం ఉంది!

وَيْلٌ يَّوْمَىِٕذٍ لِّلْمُكَذِّبِيْنَ (24)

**25.** ఏమీ? మేము భూమిని ఒక సమీకరించే స్థానంగా చేయలేదా?

اَلَمْ نَجْعَلِ الْاَرْضَ كِفَاتًا (25)

**26.** జీవించి ఉన్న వారిని మరియు మృతులను?

اَحْيَآءً وَّاَمْوَاتًا (26)

**27.** మరియు దానిలో ఎత్తైన పర్వతాలను స్థిరంగా నిలుపలేదా? మరియు మీకు త్రాగటానికి మంచి నీటిని ప్రసాదించలేదా?

وَّجَعَلْنَا فِيْهَا رَوَاسِيَ شٰمِخٰتٍ وَّاَسْقَيْنٰكُمْ مَّآءً فُرَاتًا (27)

**28.** ఆ రోజు అసత్యవాదులకు వినాశం ఉంది!

وَيْلٌ يَّوْمَىِٕذٍ لِّلْمُكَذِّبِيْنَ (28)

**29.** (సత్య-తిరస్కారులతో ఇలా అనబడు తుంది): "మీరు తిరస్కరిస్తూ వచ్చిన దాని వైపునకు పొండి!"

اِنْطَلِقُوْٓا اِلٰى مَا كُنْتُمْ بِهٖ تُكَذِّبُوْنَ (29)

---

9) చూడండి, 23:12-14.

| | |
|---|---|
| **30.** మూడు శాఖలుగా చీలిపోయే నీడ వైపునకు పదండి; | اِنْطَلِقُوْٓا اِلٰى ظِلٍّ ذِىْ ثَلٰثِ شُعَبٍ ﴿30﴾ |
| **31.** కాని అది ఏ విధమైన (చల్లని) నీడనూ ఇవ్వదూ మరియు (నరక) జ్వాలల నుండి కూడా కాపాడదు! | لَّا ظَلِيْلٍ وَّلَا يُغْنِىْ مِنَ اللَّهَبِ ﴿31﴾ |
| **32.** నిశ్చయంగా, అది (నరకం) పెద్దపెద్ద మొద్దుల వంటి అగ్నికణాలను విసురుతుంది. | اِنَّهَا تَرْمِىْ بِشَرَرٍ كَالْقَصْرِ ﴿32﴾ |
| **33.** అవి పసుపు పచ్చని ఒంటెల మాదిరిగా ఉంటాయి. | كَاَنَّهٗ جِمٰلَتٌ صُفْرٌ ﴿33﴾ |
| **34.** ఆ రోజు అసత్యవాదులకు వినాశం ఉంది! | وَيْلٌ يَّوْمَىِٕذٍ لِّلْمُكَذِّبِيْنَ ﴿34﴾ |
| **35.** ఆ దినాన వారు మాట్లాడ లేరు. | هٰذَا يَوْمُ لَا يَنْطِقُوْنَ ﴿35﴾ |
| **36.** మరియు వారికి సాకులు చెప్పుకునే అనుమతి కూడా ఇవ్వబడదు. | وَلَا يُؤْذَنُ لَهُمْ فَيَعْتَذِرُوْنَ ﴿36﴾ |
| **37.** ఆ రోజు అసత్యవాదులకు వినాశం ఉంది! | وَيْلٌ يَّوْمَىِٕذٍ لِّلْمُكَذِّبِيْنَ ﴿37﴾ |
| **38.** అది తీర్పుదినమై ఉంటుంది! మేము మిమ్మల్ని మరియు మీ పూర్వీకులను సమావేశపరచి ఉంటాము! | هٰذَا يَوْمُ الْفَصْلِ ۚ جَمَعْنٰكُمْ وَالْاَوَّلِيْنَ ﴿38﴾ |
| **39.** కావున మీ వద్ద, నా గురించి ఏదైనా పన్నాగ ముంటే దానిని పన్నండి. [10] | فَاِنْ كَانَ لَكُمْ كَيْدٌ فَكِيْدُوْنِ ﴿39﴾ |
| **40.** ఆ రోజు అసత్యవాదులకు వినాశం ఉంది! | وَيْلٌ يَّوْمَىِٕذٍ لِّلْمُكَذِّبِيْنَ ﴿40﴾ |
| **41.** నిశ్చయంగా దైవభీతి గలవారు నీడలలో సెలయేరుల మధ్య ఉంటారు. | اِنَّ الْمُتَّقِيْنَ فِىْ ظِلٰلٍ وَّعُيُوْنٍ ﴿41﴾ |
| **42.** మరియు వారికి, వారు కోరే ఫలాలు లభిస్తాయి. | وَّفَوَاكِهَ مِمَّا يَشْتَهُوْنَ ﴿42﴾ |
| **43.** (వారితో ఇలా అనబడుతుంది): "మీరు చేస్తూ ఉండిన కర్మల ఫలితంగా హాయిగా తినండి త్రాగండి!" | كُلُوْا وَاشْرَبُوْا هَنِيْٓـًٔا بِمَا كُنْتُمْ تَعْمَلُوْنَ ﴿43﴾ |

10) ఇటువంటి సందేశంగల ఆయత్ కోసం చూడండి, 55:33.

**44.** నిశ్చయంగా, మేము సజ్జనులకు ఈ విధంగా ప్రతిఫలం ఇస్తూ ఉంటాము.

إِنَّا كَذَٰلِكَ نَجۡزِي ٱلۡمُحۡسِنِينَ ﴿٤٤﴾

**45.** ఆ రోజు అసత్యవాదులకు వినాశం ఉంది!

وَيۡلٞ يَوۡمَئِذٖ لِّلۡمُكَذِّبِينَ ﴿٤٥﴾

**46.** (ఓ సత్య-తిరస్కారులారా!) మీరు కొంతకాలం తినండి, సుఖాలు అనుభవించండి. నిశ్చయంగా, మీరు నేరస్థులు!

كُلُواْ وَتَمَتَّعُواْ قَلِيلًا إِنَّكُم مُّجۡرِمُونَ ﴿٤٦﴾

**47.** ఆ రోజు అసత్యవాదులకు వినాశం ఉంది!

وَيۡلٞ يَوۡمَئِذٖ لِّلۡمُكَذِّبِينَ ﴿٤٧﴾

**48.** మరియు వారితో: "(అల్లాహ్ ముందు) వంగండి (*రుకూ'ఉ* చేయండి)." అని అన్నప్పుడు, వారు వంగలేదు.

وَإِذَا قِيلَ لَهُمُ ٱرۡكَعُواْ لَا يَرۡكَعُونَ ﴿٤٨﴾

**49.** ఆ రోజు అసత్యవాదులకు వినాశం ఉంది! [11]

وَيۡلٞ يَوۡمَئِذٖ لِّلۡمُكَذِّبِينَ ﴿٤٩﴾

**50.** దీని (ఈ ఖుర్ఆన్) తరువాత, ఇక వారు మరెలాంటి సందేశాన్ని విశ్వసిస్తారు?

فَبِأَيِّ حَدِيثِۭ بَعۡدَهُۥ يُؤۡمِنُونَ ﴿٥٠﴾

*****

11) ఈ ఆయత్ ఈ సూరహ్‌లో **10** సార్లు వచ్చింది. ఏ విధంగానైతే: "అయితే మీరిరువురు (మానవులు మరియు జిన్నాతులు) మీ ప్రభువు యొక్క ఏ యే అనుగ్రహాలను నిరాకరిస్తారు?" అనే ఆయతు సూరహ్ అర్-ర'హ్మాన్ (55)లో **31** సార్లు, వచ్చిందో! అంటే, పునరుత్థానదినాన్ని తిరస్కరించేవారికి వినాశం తప్పదనే విషయాన్ని అల్లాహు త'ఆలా మాటి మాటికి విశదీకరిస్తున్నాడు.

***